www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -221 శనివారం 28 నవంబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



కార్తీక దీపం వెలిగించాల్సిందే

: తిరుపరంకుండ్రం ఆలయ వివాదంపై సుప్రీంకోర్టు ఆగ్రహం

ఆలయ ట్రస్టీల బోర్డును సస్పెండ్ చేస్తూ ఇద్దరు రిసీవర్ల నియామకం

కొండ, ఆలయ భద్రత బాధ్యతలు సీఆర్‌పీఎఫ్‌కు అప్పగింత

ఆదేశాలు పాటించలేదని తమిళనాడు సీఎస్, డీజీపీలకు ధిక్కరణ నోటీసులు

రాజ్యాంగ సంక్షోభాన్ని సృష్టిస్తే సహించేది లేదని సుప్రీంకోర్టు హెచ్చరిక

న్యూఢిల్లీ.నవంబర్ 27 (ప్రజావినికిడి):

తిరుపరంకుండ్రం కార్తీక దీపం వివాదంపై సుప్రీంకోర్టు అత్యంత కీలకమైన ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపరంకుండ్రం కొండపై ఉన్న పురాతన దీపత్తూన్ స్తంభంపైనే శనివారం**మిగతా 2లో...**

డీలిమిటేషన్

లోక్‌సభ స్థానాలు 815కు పెంపు..

: కేంద్ర కేబినెట్ సంచలన ఆమోదం!



లోక్‌సభ సీట్లు 50 శాతం పెంపు బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

ప్రస్తుతం ఉన్న 543 స్థానాలు దాదాపు 815కు పెరిగే అవకాశం

దక్షిణాది రాష్ట్రాల దామాషా నిష్పత్తి తగ్గకుండా సమన్యాయం

నవంబరు 30 నుంచి జరిగే ప్రత్యేక పార్లమెంట్ భేటీలో బిల్లు ప్రవేశం

కేంద్రం వ్యూహాన్ని అడ్డుకునేందుకు శనివారం ఇండియా కూటమి భేటీ

న్యూఢిల్లీ నవంబర్ 27 (ప్రజావినికిడి):

దేశంలో నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), మహిళా రిజర్వేషన్ల చట్టం అమలుపై కేంద్ర ప్రభుత్వం చారిత్రక ముందడుగు వేసింది. శుక్రవారం ప్రధానమంత్రి అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం (కేబినెట్) రాజ్యాంగ సవరణ బిల్లుకు ఆమోదం తెలిపింది.

మిగతా 2లో...

అందరికీ ప్రయోజనం

డీలిమిటేషన్ బిల్లుకు చంద్రబాబు మద్దతు



మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులకు సీఎం చంద్రబాబు మద్దతు

డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలకు భంగం కలగదన్న సీఎం

ప్రస్తుతమున్న లోక్‌సభ స్థానాలను 50 శాతం పెంచాలని ప్రతిపాదన

రెండు కీలక బిల్లులకూ అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి

న్యూఢిల్లీ.నవంబర్ 27 (ప్రజావినికిడి):

మహిళలకు చట్టసభల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు దేశ జనాభా పెరుగుదలకు అనుగుణంగా పార్లమెంటు స్థానాల సంఖ్యను పెంచాల్సిన ఆవశ్యకత ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ల అమలు, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు ఆయన పూర్తి మద్దతు ప్రకటించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు.. కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, కేంద్ర మంత్రులు **మిగతా 2లో...**

తెలంగాణ విద్యుత్ రంగానికి కేంద్రం సహకరించాలి

కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో భట్టి విక్రమార్క భేటీ

రూ.25,096 కోట్ల విద్యుత్ ప్రాజెక్టులకు ఆమోదం తెలపాలని విజ్ఞప్తి..

పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులకు ఆర్థిక సాయం కోరిన ఉప ముఖ్యమంత్రి



న్యూఢిల్లీ.నవంబర్ 27 (ప్రజావినికిడి):

తెలంగాణ రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణీ వ్యవస్థలను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క కోరారు **మిగతా 2లో...**

డీలిమిటేషన్ బిల్లుకు ఆమోదం రాకపోతే..

జనాభా ప్రకారమే సీట్ల పెంపు

ఉత్తరాది ప్రజలు జనాభా ఆధారంగా సీట్లు పెంచాలని ఆందోళన చేస్తే పరిస్థితి ఏమిటన్న లక్ష్మణ్

జీడీపీ ఆధారంగా సీట్ల పెంపు ఉండాలన్న రేవంత్ రెడ్డి ప్రతిపాదనపై అభ్యంతరం

సీట్లు పెరిగితే చట్టసభల్లో ఎస్సీ, ఎస్టీల గొంతు మరింత పెరుగుతుందని వ్యాఖ్య



యువత లక్ష్యాల వైపు సాగాలి

హైదరాబాద్‌లో డ్రగ్స్ వ్యతిరేక కార్యక్రమానికి హాజరైన మెగాస్టార్ చిరంజీవి

యువత వ్యసనాలకు దూరంగా ఉండి లక్ష్యాల వైపు సాగాలని పిలుపు

కెరీర్ తొలినాళ్లలో పాండీ బజార్ అనుభవాన్ని పంచుకున్న చిరు

వ్యసనపరులను ద్వేషించకుండా రిహేబిలిటేషన్ వైపు నడిపించాలని సూచన

సభలో యువతతో కలిసి 'నషా ముక్త్ భారత్' ప్రతిజ్ఞ చేయించిన మెగాస్టార్



హైదరాబాద్ నవంబర్ 27 (ప్రజావినికిడి):

నగరంలో మాదకద్రవ్యాల మహమ్మారిని తరిమికొట్టేందుకు మెగాస్టార్ చిరంజీవి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సమాజాన్ని పట్టిపీడిస్తున్న డ్రగ్స్ రహిత భారత్ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా నడుం బిగించాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన **మిగతా 2లో...**

రూ.36 వేల కోట్ల పెట్టుబడులకు ఆమోదం



ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ముగిసిన ఏపీ కేబినెట్ వర్చువల్ భేటీ

అమరావతి సమీకృత సచివాలయం నిర్మాణ వ్యయం రూ.6,641 కోట్లకు పెంపు

కడప జిల్లా మైలవరంలో సోలార్ ప్రాజెక్టు కోసం 1,127 ఎకరాల కేటాయింపు

అనంతపురం, రైల్వేకోడూరు ప్రాంతాల్లో వేలాది ఎకరాల భూ సమస్యల పరిష్కారం

అమరావతి నవంబర్ 27 (ప్రజావినికిడి):

అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం ముగిసింది. వర్చువల్ విధానంలో జరిగిన ఈ క్యాబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. దాదాపు మూడు గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ భేటీలో రాష్ట్ర పారిశ్రామిక ప్రగతి, రాజధాని అమరావతి పనులు, విద్యుత్ రంగాభివృద్ధి, రెవెన్యూ **మిగతా 2లో...**

కూకట్ పల్లి ట్రక్ పార్క్ వేలానికి హైకోర్టు గ్రీన్ సిగ్నల్

ట్రక్ పార్క్ భూముల వేలంపై దాఖలైన పిటిషన్లు కొట్టివేసిన హైకోర్టు

పిటిషన్లలో ప్రజా ప్రయోజనం లేదన్న కోర్టు



హైదరాబాద్,నవంబర్ 27 (ప్రజావినికిడి):

హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలానికి తెలంగాణ హైకోర్టులో లైన్ క్లియర్ అయింది. ఈ భూముల వేలాన్ని నిలిపివేయాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను (పిల్స్) హైకోర్టు ధర్మాసనం కొట్టివేసింది. దీంతో హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (నవీణూ) నిర్వహించ తలపెట్టిన ఈ-వేలం ప్రక్రియకు మార్గం సుగమమైంది.కూకట్‌పల్లి మండలం మూసాపేట పరిధిలోని దాదాపు 3.15 ఎకరాల ట్రక్ పార్క్ స్థలాన్ని ప్రభుత్వం వేలం వేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ భూమిని ప్రైవేటు వ్యక్తులకు లేదా సంస్థలకుజ

పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక పాలసీ

తెలంగాణ క్లైమేట్ కాన్‌క్లేవ్ కర్టెన్‌రైజర్ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలి

పర్యావరణ పరిరక్షణతో పాటు పారిశ్రామికాభివృద్ధికి ప్రాధాన్యం

రైతులు నీటి వినియోగంపై అప్రమత్తం



హైదరాబాద్, నవంబర్ 27 (ప్రజావినికిడి):

వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు రాజకీయాలకు అతీతంగా సమష్టిగా కృషి చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. వాతావరణ పరిస్థితుల మార్పుల కారణంగా రానున్న నెలల్లో నీటి కొరత ఏర్పడే అవకాశాలున్నాయని, ప్రజలు, రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

హైదరాబాద్‌లోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన తెలంగాణ క్లైమేట్ కాన్‌క్లేవ్ కర్టెన్‌రైజర్ కార్యక్రమంలో సీఎం**మిగతా 2లో...**

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

డీలిమిటేషన్‌తో అందరికీ ప్రయోజనం

మొదటిపేజీ తరువాయి

కింజరాపు రామ్మోహన్నాయుడు,పెమ్మసాని చంద్రశేఖర్, ఇతర ఎంపీలతో కలిసి సంయుక్త మీడియా సమావేశంలో మాట్లాడారు.

సుమారు మూడు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ల అంశం ప్రస్తుతం ఒక కీలక దశకు చేరుకుందని చంద్రబాబు పేర్కొన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం స్థానాలు కేటాయించాలనే నిర్ణయం చారిత్రాత్మకమైనదని ఆయన అభివర్ణించారు. విద్య, ఉద్యోగం, ఆర్థిక రంగాల్లో మహిళలు ఇప్పటికే తమ ప్రతిభను చాటుకుంటున్నారని, రాజకీయాల్లోనూ వారికి తగిన ప్రాధాన్యం దక్కాల్సిన సమయం వచ్చిందని వివరించారు. మహిళా సాధికారతకు సామాజిక, ఆర్థిక భాగస్వామ్యంతో పాటు రాజకీయ భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని తెలిపారు.

దేశంలో జనాభా పెరుగుదలకు అనుగుణంగా ప్రజాప్రతినిధుల ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. 1971 జనాభా లెక్కల ఆధారంగా 1976లో నియోజకవర్గాల పునర్విభజన జరిగిందని, అప్పట్లో దేశ జనాభా 58.8 కోట్లుగా ఉన్నప్పుడు లోక్‌సభలో 543 స్థానాలు ఉండేవని చెప్పారు. ప్రస్తుతం దేశ జనాభా దాదాపు 147 కోట్లకు చేరుకున్న తరుణంలోనూ అదే సంఖ్య కొనసాగడం సమంజసం కాదన్నారు.

1971లో ప్రతి 10 లక్షల మందికి ఒక ఎంపీ ప్రాతినిధ్యం వహిస్తే, ప్రస్తుతం సగటున 27 లక్షల మందికి ఒక ఎంపీ ప్రాతినిధ్యం వహించాల్సి వస్తోందని వివరించారు. నియోజకవర్గాల సంఖ్యను 50 శాతం పెంచడం ద్వారా ప్రతి 18 లక్షల మందికి ఒక ఎంపీ ఉండేలా మార్పు తీసుకురావచ్చని, తద్వారా ప్రజల సమస్యలను చట్టసభల్లో సమర్థంగా వినిపించే అవకాశం దక్కుతుందని అభిప్రాయపడ్డారు.డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న ఆందోళనలపై చంద్రబాబు స్పందించారు. గతంలో జనాభా నియంత్రణలో దక్షిణాది రాష్ట్రాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. కేవలం 2026 జనాభా లెక్కల ప్రాతిపదికన మాత్రమే పునర్విభజన చేపడితే సంతానోత్పత్తి రేటు తక్కువగా ఉన్న దక్షిణాది రాష్ట్రాలు రాజకీయ ప్రాతినిధ్యంలో నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందువల్ల జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన రాష్ట్రాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా, అన్ని రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉన్న స్థానాలపై ఏకరూపంగా 50 శాతం సీట్లు పెంచే విధానం అత్యంత సరైనదని ప్రతిపాదించారు.

ఈ విధానం అమలు చేస్తే ఆంధ్రప్రదేశ్‌లోని లోక్‌సభ స్థానాలు ప్రస్తుతమున్న 25 నుంచి 38కి పెరుగుతాయని సీఎం వివరించారు. అలాగే తమిళనాడులో 59, కర్ణాటకలో 42, తెలంగాణలో 26, కేరళలో 30 స్థానాలకు పెరుగుతాయని, వెరసి దక్షిణాది రాష్ట్రాల్లో మొత్తం పార్లమెంటు స్థానాల సంఖ్య 195కు చేరుతుందని విశ్లేషించారు. దీనివల్ల దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలకు భంగం కలగకుండా సమాఖ్య సమతుల్యత కాపాడబడుతుందని తెలిపారు. 2029 సాధారణ ఎన్నికల నాటికి ఈ నియోజకవర్గాల పునర్విభజన పూర్తి కావాల్సి ఉందని, అప్పుడే మహిళా రిజర్వేషన్ల సమర్థ అమలుకు మార్గం సుగమం అవుతుందని చెప్పారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీ రామారావు హయాంలోనే మహిళలకు ఆస్తి హక్కు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించి రాజకీయ ప్రాతినిధ్యానికి పునాది వేశారని చంద్రబాబు గుర్తుచేశారు. అనంతరం డ్వాక్రా సంఘాల ద్వారా మహిళల ఆర్థిక సాధికారతకు కృషి జరిగిందని, ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో అనేక మేయర్ స్థానాలను మహిళలే దక్కించుకోవడం వారి ఎదుగుదలకు నిదర్శనమని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఇప్పటికే తీర్మానం చేసి కేంద్రానికి పంపిందని తెలిపారు.

ఈ నెలాఖరులో జరిగే పార్లమెంటు సమావేశాల్లో సభ్యులందరూ మహిళా రిజర్వేషన్ల బిల్లుకు అనుకూలంగా ఓటు వేయాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. గతంలో చోటుచేసుకున్న రాజకీయ విభేదాలను పక్కనబెట్టి, దేశ ప్రయోజనాలు, మహిళల భవిష్యత్తు దృష్ట్యా అన్ని రాజకీయ పార్టీలు ఈ కీలక బిల్లులకు ఏకగ్రీవంగా మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. మహిళా సాధికారతకు దోహదపడే బిల్లులను వ్యతిరేకించే రాజకీయ పార్టీలను దేశంలోని మహిళలు తిరస్కరిస్తారని ఆయన స్పష్టం చేశారు.

రూ.36 వేల కోట్ల పెట్టుబడులకు ఆమోదం

మొదటిపేజీ తరువాయి

సమస్యల పరిష్కారానికి సంబంధించి దాదాపు 30 అంశాలపై విస్తృతంగా చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు.

రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కేబినెట్ నిర్ణయాలు ఉన్నాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.

కేబినెట్ ఆమోదించిన నిర్ణయాల పూర్తి వివరాలు:

పారిశ్రామిక రంగం–పెట్టుబడులు:

ఏపీ ఎంఎస్ఎంఈ రైట్ టు బిజినెస్ బిల్లు–2026: పరిశ్రమల స్థాపనలో ఎదురయ్యే జాప్యాన్ని నివారించేందుకు నూతన బిల్లుకు ఆమోదం.

రూ.36 వేల కోట్ల పెట్టుబడులు: సీఐఐ భాగస్వామ్య సదస్సుల ద్వారా వచ్చిన 6 దిగ్గజ కంపెనీల ప్రతిపాదనలకు పచ్చజెండా. దీని ద్వారా వేలాది మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి.

కియా రెండో ప్లాంట్: శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ వద్ద రూ.19,000 కోట్ల పెట్టుబడితో కియా రెండో ఆటోమొబైల్ తయారీ కేంద్రం ఏర్పాటుకు అనుమతి.

అదానీ టైటానియం కాంప్లెక్స్: శ్రీకాకుళం జిల్లాలో రూ.13,667 కోట్ల వ్యయంతో అదానీ ఇంటిగ్రేటెడ్ టైటానియం కాంప్లెక్స్ స్థాపనకు ఆమోదం.

సెయింట్-గోబైన్ ఫ్లోట్ గ్లాస్: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో రూ.1,800 కోట్లతో ఫ్లోట్ గ్లాస్ తయారీ యూనిట్ ఏర్పాటుకు కేబినెట్ క్లియరెన్స్.

అమరావతి రాజధాని పనులు

ప్రధాన భవనాల నిర్మాణం: అమరావతిలో హైకోర్టు, అసెంబ్లీ, సచివాలయ నిర్మాణ పనులకు సంబంధించి నిధుల కేటాయింపు.

సచివాలయ వ్యయం పెంపు: సమీకృత సచివాలయం, విభాగాధిపతుల (ఎశీణ) కార్యాలయాల నిర్మాణ వ్యయాన్ని రూ.4,688 కోట్ల నుంచి రూ.6,641 కోట్లకు సవరిస్తూ నిర్ణయం.

గ్రామాల అభివృద్ధి: రాజధాని పరిధిలోని స్థానిక గ్రామాల మౌలిక వసతుల పనుల కోసం రూ.1,215 కోట్లు మంజూరు.

అమరావతి సంగమం: శాఖమూరు వద్ద పర్యాటక, సాంస్కృతిక కేంద్రంగా 'అమరావతి సంగమం' నిర్మాణానికి రూ.626 కోట్లు ఖరారు.

గ్రీన్ వర్క్స్: రాజధాని పరిధిలో గ్రీన్ వర్క్స్ ప్యాకేజీ-2 పనుల కోసం రూ.180.68 కోట్లకు పరిపాలనా అనుమతులు.

విద్యుత్, పునరుత్పాదక ఇంధనం

ఏపీజెన్‌కో – కోల్ ఇండియా జేవీ: రాష్ట్ర ఇంధన అవసరాలను తీర్చేందుకు కోల్ ఇండియాతో కలిసి ఏపీజెన్‌కో సంయుక్త భాగస్వామ్యం (జీఏ) ఏర్పాటుకు అనుమతి.

మైలవరం సోలార్ ప్లాంట్: వైఎస్సార్ కడప జిల్లా మైలవరంలో 1,000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్రాజెక్టు కోసం 1,127 ఎకరాల భూమి కేటాయింపు.

పవన విద్యుత్ ప్రాజెక్టు: నంద్యాల జిల్లాలో 210 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టు బదిలీ ప్రక్రియకు కేబినెట్ ఆమోదం.

బయోగ్యాస్ ప్లాంట్: ప్రకాశం జిల్లాలో రోజుకు 12 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు నిర్ణయం.

రెవెన్యూ, భూ సమస్యల పరిష్కారం

నిషేధిత జాబితా నుంచి భూముల తొలగింపు: అనంతపురం జిల్లాలో 9,917 ఎకరాలను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించారు. దీనివల్ల 4,352 మంది రైతులకు (పట్టాదారులకు) ఊరట లభించింది.

వెబ్‌ల్యాండ్ రికార్డుల సవరణ: రైల్వేకోడూరు పరిధిలోని 10,192 ఎకరాల భూములకు సంబంధించిన వెబ్‌ల్యాండ్ రికార్డుల తప్పులను సరిదిద్దేందుకు అనుమతి.

హక్కులపై స్పష్టత: భూ వివాదాలను పరిష్కరించే సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వ, అసైన్డ్, వివాదాస్పద భూములపై ఎవరికీ కొత్తగా ఎలాంటి హక్కులు కల్పించకూడదని కేబినెట్ స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది.

రాష్ట్రానికి భారీ పరిశ్రమలను రప్పించడంతో పాటు, రాజధాని పనులను పరుగులు పెట్టించేలా, సామాన్యుల భూ సమస్యలను పారదర్శకంగా పరిష్కరించేలా మంత్రివర్గం సమగ్రమైన కార్యాచరణను ఖరారు చేసింది.

యువత లక్ష్యాల వైపు సాగాలి

మొదటిపేజీ తరువాయి

'నషా ముక్త్ భారత్ అభియాన్' ముగింపు సదస్సులో పాల్గొన్న చిరంజీవి, యువతను చైతన్యపరుస్తూ స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు.ఈ సందర్భంగా చిరంజీవి తన జీవితంలో 48 ఏళ్ల క్రితం జరిగిన ఒక ముఖ్యమైన సంఘటనను గుర్తుచేసుకున్నారు. 22 ఏళ్ల వయసులో ప్రసాద్‌గా ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో నటన నేర్చుకుంటున్న సమయంలో, చెన్నై పాండీ బజార్‌లో ఎదురైన అనుభవాన్ని వివరించారు. అక్కడ కొందరు తనకు బీరు ఆఫర్ చేస్తూ, పరిశ్రమలో అవకాశాలు రావాలంటే ఇలాంటి అలవాట్లు, పార్టీలు తప్పవని చెప్పారని తెలిపారు. అయితే, తనకు అలాంటి అలవాట్లు లేవని కరాఖండీగా చెప్పి అక్కడి నుంచి బయటకు వచ్చేశానని అన్నారు. ఆ సమయంలో ఒక పెద్ద మనిషి ఇచ్చిన సలహా తన జీవితాన్నే మార్చివేసిందని వెల్లడించారు. "ఒక్కసారి అలవాటు చేసుకుంటే అది వ్యసనంగా మారి లక్ష్యాలను చిన్నాభిన్నం చేస్తుంది. కళ్లకు గంతలు కట్టిన గుర్రంలా నీ లక్ష్యం మీదే దృష్టి పెట్టు" అని ఆయన చెప్పిన మాటలను తు.చ తప్పకుండా పాటించబట్టే, ఈ రోజు



మెగాస్టార్‌గా మీ ముందు నిలబడగలిగానని చిరంజీవి స్పష్టం చేశారు.

యువత కేవలం సినిమా రంగంలోనే కాకుండా డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు, శాస్త్రవేత్తలు, రాజకీయ నాయకులుగా ఎదిగి తమ రంగాల్లో నిజమైన హీరోలు కావాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు, సమాజం గర్వపడే స్థాయికి చేరుకోవాలన్నారు. అయితే, ఉన్నత శిఖరాలను అధిరోహించే మార్గంలో డ్రగ్స్ అనే పెనుభూతం పొంచి ఉందని హెచ్చరించారు. సరదా కోసమో లేదా స్నేహితుల బలవంతం వల్లో 'ఒక్కసారే కదా' అని మొదలుపెడితే, అది క్రమంగా వ్యసనంగా మారి జీవితాలను, కుటుంబాలను రోడ్డున పడేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.డ్రగ్స్ బారిన పడిన వారిని సమాజం చిన్నచూపు చూడకూడదని చిరంజీవి ఒక కీలక విజ్ఞప్తి చేశారు. "మన పోరాటం డ్రగ్స్‌పైనే తప్ప, డ్రగ్స్‌కు బానిసలైన వారిపై కాదు. వారిపై సానుభూతి చూపించి, సరైన మార్గంలో పెట్టి, రిహాబిలిటేషన్ సెంటర్లకు పంపించి సాధారణ జీవితం గడిపేలా చూడటం మన బాధ్యత" అని హితవు పలికారు. ప్రపంచంలోనే అత్యధిక యువశక్తి కలిగిన దేశం భారత్ అని, యువత సరైన మార్గంలో పయనిస్తే ప్రపంచంలోనే దేశాన్ని ఎవరూ ఆపలేరని పేర్కొన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పించిన డ్రగ్స్ రహిత భారత నిర్మాణంలో భాగంగా కిషన్ రెడ్డి చేస్తున్న ప్రయత్నాలు గొప్ప ప్రారంభమని ఆయన కొనియాడారు. తన 'స్టాలిన్' సినిమా కాన్సెప్ట్ తరహాలో ఒకరు ముగ్గురికి అవగాహన కల్పిస్తూ చైతన్యాన్ని విస్తరించాలని సూచించారు. అనంతరం, దేశాన్ని మాదకద్రవ్య రహితంగా మార్చేందుకు మనసా, వాచా, కర్మణా కృషి చేస్తామని యువతతో కలిసి చిరంజీవి స్వయంగా ప్రతిజ్ఞ చేయించారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక పాలసీ

మొదటిపేజీ తరువాయి

మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని, రానున్న ఎనిమిది నెలలపాటు వర్షాలు లేకపోయే పరిస్థితులను కూడా దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు.రాష్ట్రంలో రాబోయే కాలంలో తాగునీరు, సాగునీటి అవసరాలను సమతుల్యం చేసుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. అవసరమైతే రైతులు ఒక పంటను వదులుకోవడాన్ని కూడా పరిశీలించాలని సూచించారు. ప్రజలు, పశువులు, వన్యప్రాణులకు నీటి లభ్యతను కాపాడటం అందరి బాధ్యతని పేర్కొన్నారు.

రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులను ప్రోత్సహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. పెట్టుబడులు, ప్రకృతి రెండూ తెలంగాణకు రెండు కళ్ల వంటివని వ్యాఖ్యానించారు. పర్యావరణవేత్తలు తమ అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలియజేయాలని, వారి సూచనల ఆధారంగా ప్రత్యేక పర్యావరణ విధానాన్ని రూపొందిస్తామని చెప్పారు.

హైదరాబాద్‌లో డీజిల్ ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు చర్యలు చేపడుతున్నామని, ఆర్టీసీ డీజిల్ బస్సులను కూడా నగరం నుంచి దశలవారీగా తొలగించే ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు. చెరువులు, జలవనరుల పరిరక్షణ కోసం హైడ్రాను ఏర్పాటు చేశామని తెలిపారు. మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమాన్ని కూడా కొనసాగిస్తామని పేర్కొన్నారు.

డిసెంబర్ 8న ప్రత్యేక కార్యాచరణ

డిసెంబర్ 7, 8 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో తెలంగాణ క్లైమేట్ కాన్క్లేవ్ నిర్వహించనున్నారు. వర్షాభావ పరిస్థితులు, తాగునీటి భద్రత, వ్యవసాయం, అడవుల సంరక్షణ, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, పునరుత్పాదక ఇంధన వనరులపై చర్చించనున్నారు. డిసెంబర్ 8న ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలతో కూడిన ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సీఎం విడుదల చేయనున్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవిశంకర్, జల సంరక్షణ ఉద్యమకారుడు రాజేంద్రసింగ్, పలువురు పర్యావరణ నిపుణులు, అధికారులు పాల్గొన్నారు.

డీలిమిటేషన్

మొదటిపేజీ తరువాయి

ఈ తాజా నిర్ణయం ప్రకారం లోక్‌సభ స్థానాల సంఖ్యను ఏకరీతిగా 50 శాతం పెంచనున్నారు. దీంతో ప్రస్తుతం 543గా ఉన్న లోక్‌సభ సభ్యుల సంఖ్య దాదాపు 815 స్థానాలకు చేరనుంది. అంతేకాకుండా, పెరిగిన ఈ స్థానాల సంఖ్యపై రాబోయే 25 ఏళ్ల పాటు.. అంటే 2051 వరకు ఎలాంటి మార్పు లేకుండా 'ఫ్రీజ్' (స్తంభింపజేయడం) విధించనున్నట్లు సమాచారం.

ఈ బిల్లు పూర్తి విధివిధానాలు ఇంకా అధికారికంగా వెల్లడి కాలేదు. అయితే అన్ని రాష్ట్రాల ప్రస్తుత దామాషా (ప్రపోర్షనల్ షేర్) ప్రాతినిధ్యం మారకుండా యథాతథంగా కొనసాగించాలని కేంద్రం భావిస్తోంది. జనాభా ఆధారంగా డీలిమిటేషన్ చేస్తే జనాభాను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలకు సీట్లు తగ్గి అన్యాయం జరుగుతుందన్న ఆందోళనలు తీవ్రంగా ఉన్నాయి. డీఎంకే వంటి విపక్ష పార్టీలు ఈ అంశాన్ని బలంగా లేవనెత్తాయి. వీటికి చెక్ పెట్టేందుకే అన్ని రాష్ట్రాల్లో సమానంగా 50 శాతం సీట్లు పెంచే ఫార్ములాను కేంద్రం తెరపైకి తెచ్చింది. తద్వారా దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యత తగ్గకుండా కాపాడవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.నవంబరు 30 నుంచి డిసెంబరు 3 వరకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లోనే డీలిమిటేషన్, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును ప్రభుత్వం సభ ముందుకు తీసుకురానుంది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. సభలో అత్యంత కీలక అంశాలపై చర్చ జరగనుందని, విపక్షాలు అనవసర వ్యాఖ్యలు మానుకోవాలని సూచించారు. గత ఏప్రిల్‌లో అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ లేకపోవడంతో ఈ బిల్లు వీగిపోయిన సంగతి తెలిసిందే.కేంద్రం తాజా ఎత్తుగడపై విపక్ష శిబిరంలో తీవ్ర చర్చ మొదలైంది. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఈ నిర్ణయంపై మండిపడ్డారు. ఇది 'భాజపా చేసిన అతిపెద్ద తప్పు' అని, ఉత్తరప్రదేశ్‌లో ఎన్నికల లబ్ధి కోసమే ఇలా చేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు, డీలిమిటేషన్ బిల్లును అడ్డుకునేందుకు 'ఇండియా' కూటమి ఉమ్మడి వ్యూహం రచిస్తోంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో శనివారం ఉదయం 11 గంటలకు విపక్ష పార్టీల నేతల అత్యవసర సమావేశం జరగనుంది.

కార్తీక దీపం వెలిగించాల్సిందే

మొదటిపేజీ తరువాయి

సంప్రదాయబద్ధంగా కార్తీక దీపాన్ని వెలిగించాలని ఆదేశించింది. ఉచ్చిపిళ్లైయార్ మండపం నుంచి తీసుకొచ్చిన పవిత్ర జ్యోతితోనే ఈ దీపాన్ని వెలిగించాలని జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ విపుల్ ఎం. పంచోలిలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది.ఈ వివాదం తీవ్రరూపం దాల్చడంతో అరుళ్మిగు సుబ్రమణ్యస్వామి ఆలయ ట్రస్టీల బోర్డును సుప్రీంకోర్టు తక్షణమే సస్పెండ్ చేసింది. ఆలయ పరిపాలన, నిర్వహణ బాధ్యతలను సజావుగా నడిపించేందుకు మద్రాస్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ ఎస్. వైద్యనాథన్, జస్టిస్ వి. పార్థిబన్‌లను రిసీవర్లుగా నియమించింది. అంతేకాకుండా, ఆలయం మరియు కొండ పరిసర ప్రాంతాల భద్రతను కేంద్ర రిజర్వ్ పోలీస్ బలగాలకు (సీఆర్‌పీఎఫ్) అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది.దీపత్తూన్‌పై దీపం వెలిగించేందుకు అనుమతిస్తూ నవంబర్ 20న ఇచ్చిన మునుపటి ఉత్తర్వులను అధికారులు అమలు చేయకపోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. గత ఆదేశాలను ఉల్లంఘించి, దీపత్తూన్‌పై కాకుండా కేవలం ఉచ్చి పిళ్లైయార్ ఆలయం సమీపంలోని దీప మండపం వద్దే దీపం వెలిగించడాన్ని కోర్టు తీవ్రంగా పరిగణించింది. ప్రభుత్వ యంత్రాంగం ఉద్దేశపూర్వకంగా కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడాన్ని ఉపేక్షించబోమని, ఇలాంటి వైఖరిని ఉక్కుపాదంతో అణచివేయాల్సి ఉంటుందని ధర్మాసనం హెచ్చరించింది. రాజ్యాంగ సంక్షోభాన్ని సృష్టించేందుకు ఏ ఒక్కరూ ప్రయత్నించకూడదని ఘాటుగా వ్యాఖ్యానించింది.కోర్టు ఆదేశాలను ఉల్లంఘించినందుకు గాను తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), డీజీపీ, మధురై జిల్లా కలెక్టర్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులకు సుప్రీంకోర్టు కోర్టుధిక్కరణ నోటీసులు జారీ చేసింది. ఈ వ్యవహారంలో అధికారుల మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు, సంభాషణల పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని, తదుపరి విచారణకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్వయంగా హాజరు కావాలని ఆదేశించింది.

కూకట్ పల్లి ట్రక్ పార్క్ వేలానికి హైకోర్టు గ్రీన్ సిగ్నల్

మొదటిపేజీ తరువాయి

విక్రయించవద్దని, ట్రక్ పార్కింగ్ కోసం కేటాయించిన స్థలాన్ని యథాతథంగా ఉంచాలని కోరుతూ కూకట్‌పల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, సామాజిక కార్యకర్త మాధవరం కాంతారావుతో పాటు ట్రక్ పార్క్ అసోసియేషన్ వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. ప్రజా ప్రయోజనం కోసం సేకరించిన ఈ భూమికి కంచె వేసి రక్షించాలని పిటిషనర్లు కోరారు.

ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం.. ఇరుపక్షాల వాదనలను పరిశీలించింది. ఈ పిటిషన్లలో ఎలాంటి ప్రజా ప్రయోజనం కనిపించడం లేదని న్యాయస్థానం స్పష్టం చేస్తూ వ్యాజ్యాలను కొట్టివేసింది. ప్రత్యక్షంగా ప్రభావితమయ్యే ట్రక్ యజమానులు ఎవరూ కోర్టును ఆశ్రయించలేదని ధర్మాసనం గుర్తుచేసింది. న్యాయపరమైన చిక్కులు తొలగిపోవడంతో, హెచ్ఎండీఏ అధికారిక షెడ్యూల్ ప్రకారం నిర్ణీత సమయానికి ఈ-వేలం నిర్వహణకు సన్నాహాలు పూర్తి చేసింది. ఈ భూమి విక్రయం ద్వారా ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

తెలంగాణ విద్యుత్ రంగానికి కేంద్రం సహకరించాలి

మొదటిపేజీ తరువాయి

ఖట్టర్ అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్రాల విద్యుత్ శాఖ మంత్రుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ విద్యుత్ రంగానికి సంబంధించిన పలు కీలక అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.రివాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (=ఖూూ) కింద తెలంగాణ ప్రభుత్వం రూ.25,096 కోట్లతో రూపొందించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలను మే 27న పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు సమర్పించినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, విద్యుత్ పంపిణీ నష్టాల తగ్గింపు, పంపిణీ వ్యవస్థల ఆధునికీకరణ ఈ ప్రాజెక్టుల్లో భాగమని వివరించారు. ఇప్పటివరకు ఈ పథకం కింద తెలంగాణకు కేవలం రూ.72 కోట్ల బడ్జెట్ సహాయం మాత్రమే అందిందని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న డీపీఆర్‌లకు 60 రోజుల్లో ఆమోదం తెలపాలని, పనుల పూర్తికి 2028 మార్చి 31 వరకు గడువు పొడిగించాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థలు చేపట్టే పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులకు కూడా కేంద్రం ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టులకు మెగావాట్‌కు రూ.కోటి చొప్పున వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (ఎ+ఖీ) ఇవ్వాలని కోరారు. టీజీ జెన్‌కో ప్రతిపాదించిన కల్వూరు పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థ (జఙూూ) త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. తెలంగాణలో ప్రతిపాదించిన 2,000 మెగావాట్ అవర్ బ్యాటరీ విద్యుత్ నిల్వ ప్రాజెక్టులకు కూడా కేంద్ర ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

డీలిమిటేషన్ బిల్లుకు ఆమోదం రాకపోతే..
జనాభా ప్రకారమే సీట్ల పెంపు

ఉత్తరాది ప్రజలు జనాభా ఆధారంగా సీట్లు పెంచాలని ఆందోళన చేస్తే పరిస్థితి ఏమిటన్న లక్ష్మణ్

హైదరాబాద్, నవంబర్ 27 (ప్రజావినికిడి):

డీలిమిటేషన్ అంశంపై బీజేపీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ... రాబోయే డీలిమిటేషన్‌కు సంబంధించి పార్లమెంట్‌లో డిసెంబర్ నాటికి బిల్లు ఆమోదం పొందకపోతే, ఆ తర్వాత సీట్ల పెంపు ప్రక్రియను జనాభాకు అనుగుణంగానే చేపట్టాల్సి వస్తుందని పేర్కొన్నారు.భవిష్యత్తులో ఉత్తరాది ప్రజలు తమ జనాభా నిష్పత్తి ప్రకారమే డీలిమిటేషన్ చేయాలని ఆందోళనలు ప్రారంభిస్తే పరిస్థితి ఏంటని లక్ష్మణ్ ప్రశ్నించారు. ప్రస్తుతం కొందరు దక్షిణాది, ఉత్తరాది అంటూ ప్రాంతీయ విభేదాలు, తారతమ్యాలు సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈశాన్య రాష్ట్రాల్లో ఒక్కో రాష్ట్రానికి ఒకే ఎంపీ ఉన్న పరిస్థితులను కూడా గమనించాలని సూచించారు.

జీడీపీని ప్రాతిపదికగా తీసుకుని ఎంపీ సీట్లను పెంచాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రతిపాదనను లక్ష్మణ్ ప్రశ్నించారు. జీడీపీ అనేది ప్రతి ఏటా మారుతూ ఉంటుందని, అలాంటప్పుడు ఎంపీ సీట్లను కూడా ప్రతి సంవత్సరం పెంచడం లేదా తగ్గించడం సాధ్యమేనా అని నిలదీశారు. సాధారణంగా డీలిమిటేషన్ ప్రక్రియ ప్రతి పదేళ్లకు ఒకసారి జరుగుతుందని గుర్తుచేశారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

శనివారం 28 నవంబర్ 2026

మనసులోని భక్తి, మనిషిలోని మానవత్వాన్ని తెలిపేదే అయ్యప్ప దీక్ష..

ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):
సీఎంసీ నిజాంపేట్ సర్కిల్ 191 ఎన్టీఆర్ నగర్ కాలనీ లో పగడాల శ్రీనివాస్ రెడ్డి,పగడాల నాగిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప మహా పడి పూజ కార్యక్రమంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,మనసులోని భక్తి, మనిషిలోని మానవత్వాన్ని తెలిపేదే "అయ్యప్ప దీక్ష" అని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ధన్ రాజ్ యాదవ్, పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, నిజాంపేట్ శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం చైర్మన్ కొలను చంద్రశేఖర్ రెడ్డి, మాజీ వార్డు మెంబర్ కుమార్ రెడ్డి,బిఆర్ఎస్ నాయకులు చందు ముదిరాజ్, సాంబశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి): 126 – జగద్గిరిగుట్ట డివిజన్ రింగ్ బస్తీలో బిఆర్ఎస్ మహిళా నాయకురాలు శోభ ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప పడిపూజ కార్యక్రమంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పాల్గొని అయ్యప్ప స్వామి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అయ్యప్ప స్వామి కృపా కటాక్షాలు భక్తులందరిపై సంపూర్ణంగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్,శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు జైహింద్, యాదగిరి,విఠల్, విష్ణేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ యువ నాయకులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం.. పుప్పాల భాస్కర్



కుత్బుల్లాపూర్,(ప్రజావినికిడి):
ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని బావర్చి హోటల్‌లో ఉద్యోగాల అంశంపై శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న బీఆర్ఎస్ యువ నాయకులు మన్నె క్రిషాంక్, ముఠా జైసింహ, జగన్ పాటిమీది, దినేష్ చౌదరి, విష్ణువర్ధన్ రెడ్డి, హరీశ్ రెడ్డిలపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను.
ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిరుద్యోగ యువతకు రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శిస్తూ, నిరుద్యోగుల సమస్యను ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకు రాహుల్ గాంధీ చిత్రపటంతో డిన్నర్ కార్యక్రమం నిర్వహించడం ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కులో భాగమే.అలాంటి శాంతియుత నిరసనను కూడా సహించలేక యువ నాయకులపై దాడికి పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం.ఈ ఘటనలో స్వయంగా ఒక రాజ్యసభ సభ్యుడే దాడికి నాయకత్వం వహించి,తన అనుచరులతో దాడి చేయించారనే ఆరోపణలు అత్యంత ఆందోళనకరం. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకలను భౌతిక దాడులతో అణచివేయాలని చూడటం సరైన విధానం కాదు.ఈ ఘటనకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించి,దాడికి పాల్పడిన వారితో పాటు దాడికి నాయకత్వం వహించిన వారిపై కూడా తక్షణమే నిష్పక్షపాత విచారణ జరిపించి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. బాధిత యువ నాయకులకు తగిన న్యాయం చేయాలి.ప్రశ్నించే గొంతుకలను దాడులతో అణచివేయలేరు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలియజేశారు.

పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం..

లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులు అందజేసిన కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):



కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో పలువురు పేద ప్రజలు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ, ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో వారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ని సంప్రదించగా, ఆయన వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం మంజూరు చేయించారు.ఈ మేరకు శుక్రవారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు సిఏంఆర్ఎఫ్ మంజూరి పత్రాలు (చెక్కులు) అందజేశారు.ఈ సందర్భంగాజగద్గిరిగుట్ట కు చెందిన ఎరువు అశోక్ రెడ్డి కి – రూ.60,000/– కుత్బుల్లాపూర్ కు చెందిన ఏ.శరణప్ప కు రూ.27,500/– చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని, అనారోగ్యం బారిన పడిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో డీసీసీ సెక్రటరీ వనీర్ గణేష్, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు బండి శ్యామ్ గౌడ్,దుద్దు రాహుల్,మహేష్ గౌడ్,ఇస్తాన్, సాయి స్వరూప్, వంశి,రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై సమష్టి పోరాటం అవసరం

బాలికలకు విద్య,భద్రత కల్పించడం సమాజం బాధ్యత.. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్





రాజేంద్రనగర్, (ప్రజావినికిడి):
బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పిలుపునిచ్చారు. బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ వంటి సామాజిక దురాచారాలను పూర్తిగా అరికట్టేందుకు సమష్టిగా కృషి చేయాలని అన్నారు. రాజేంద్రనగర్ ప్రభుత్వ కళాశాలలో శుక్రవారం ఆశ్రిత సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ బాల్య,శైశవ బలవంతపు వివాహాల నిర్మూలన దినోత్సవ సదస్సుకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాలికలకు నాణ్యమైన విద్య,తగిన రక్షణ, గౌరవప్రదమైన బాల్యాన్ని అందించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. బాల్యవివాహాల వల్ల బాలికల విద్య, భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు.ప్రతి బాలికకు చదువుకునే అవకాశం కల్పించడంతో పాటు,బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. తెలంగాణను బాల్యవివాహ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు,ప్రజలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ రాములు, సీడీపీఓ అధికారులు, కళాశాల ప్రతినిధులు, ఆశ్రిత సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు స్థలాన్ని కబ్జా నుంచి విడిపించాలి

సీసీ రోడ్డు నిర్మాణానికి అడ్డంకులు తొలగించాలి.. తహసీల్దార్‌కు చౌదరిగూడ సర్పంచ్ వినతి

శంషాబాద్, (ప్రజావినికిడి): నవంబర్ 27,



గ్రామాభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసిన సీసీ రోడ్డు నిర్మాణానికి ఆటంకాలు తొలగించి,రోడ్డు స్థలాన్ని కబ్జా నుంచి విడిపించాలని చౌదరిగూడ గ్రామ సర్పంచ్ లక్ష్మి లింగం రెవెన్యూ అధికారులను కోరారు.ఈ మేరకు వార్డు సభ్యులతో కలిసి శంషాబాద్ మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. శంషాబాద్ మండల పరిధిలోని చౌదరిగూడ గ్రామం నుంచి పోతురాజు ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించే క్రమంలో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తమ ప్లాట్లు రోడ్డు మధ్యలో ఉన్నాయంటూ అభ్యంతరం వ్యక్తం చేస్తూ పనులను అడ్డుకుంటున్నారని సర్పంచ్ తెలిపారు.రోడ్డు స్థలాన్ని కొందరు ఆక్రమించుకున్నారనే ఆరోపణల నేపథ్యంలో రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి ప్రభుత్వ రికార్డుల ప్రకారం రహదారి హద్దులను గుర్తించాలని వినతిపత్రంలో కోరారు. రోడ్డు స్థలాన్ని ఆక్రమణల నుంచి విడిపించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. గ్రామం నుంచి పోతురాజు ఆలయం వరకు చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి అడ్డంకులు తొలగించి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మి లింగం మాట్లాడుతూ, గ్రామాభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో అభివృద్ధి పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం గ్రామానికి ఉపయోగపడే రహదారి నిర్మాణాన్ని అడ్డుకోవద్దని సూచించారు. గ్రామస్తులకు ఇబ్బందులు కలగకుండా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ప్రేమ్‌రాజ్,వార్డు సభ్యులు ఒక్క రాజు,మల్లేష్ యాదవ్, జంగయ్య, లింగం,బక్క సుధాకర్, పెంటయ్య, ప్రసాద్ గౌడ్, నరేష్ గౌడ్, భానుచందర్, లావణ్య,సుశీల, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

చంపాపేట్ ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

ఎల్బీనగర్,(ప్రజావినికిడి):





శుక్రవారం రోజు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చంపాపేట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి, పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిశీలించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, దాదాపు ఏడాది క్రితం రూ.17 లక్షల వ్యయంతో పాఠశాలలో జీ+2 మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టినప్పటికీ, ఇప్పటివరకు వాటికి అవసరమైన కుండీలు ఏర్పాటు చేయకపోవడం, నీటి సౌకర్యం కల్పించకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.ఈ విషయంపై సంబంధిత కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి,పనులు పూర్తిచేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) గారికి ఫోన్ చేసి సమస్యను వివరించి, తక్షణమే పరిష్కరించాలని కోరారు.దీనిపై అధికారులు అతి త్వరలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.అనంతరం విద్యార్థులతో మాట్లాడగా,ఈ పాఠశాలలో దాదాపు 700 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, ఇంతమంది విద్యార్థులకు కేవలం 8 నుంచి 9 మరుగుదొడ్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అలాగే పాఠశాలలో పనిచేస్తున్న 32 మంది ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందికి కూడా సరైన మరుగుదొడ్ల సౌకర్యం లేదని తెలిపారు.
విద్యార్థులకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ, విద్యాశాఖ అధికారుల బాధ్యత అని, ముఖ్యంగా పాఠశాలల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, మరుగుదొడ్ల వంటి ప్రాథమిక సదుపాయాల విషయంలో నిర్లక్ష్యం చేయకూడదని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఇదేనా?

ఒకవైపు ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ అంతర్జాతీయ స్థాయి విద్య అంటూ గొప్పలు చెబుతున్నారు. మరోవైపు క్షేత్రస్థాయిలో విద్యార్థులు కనీస వసతుల కోసం ఇబ్బందులు పడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. విద్యార్థులకు సరైన తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, డిజిటల్ సదుపాయాలు కల్పించడంలో ఇబ్బందులు ఉంటే,ఈ గొప్ప ప్రకటనలన్నీ ఎవరి కోసం?
సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్ విజయ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ముడుపు రాజిరెడ్డి,రవి ముదిరాజ్, గండికోట శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

చాలా కాలం తర్వాత మంచి సినిమా చూశా: కేటీఆర్

'ఆకాశంలో ఒక తార' సినిమా అద్భుతంగా ఉందన్న కేటీఆర్



ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'ఆకాశంలో ఒక తార' సినిమాపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశంసల జల్లు కురిపించారు. సినిమా ఎంతో బాగుందని, చాలా కాలం తర్వాత ఇంతటి అందమైన చిత్రాన్ని చూశానని ఆయన సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ఈ మేరకు చిత్ర బృందాన్ని అభినందిస్తూ 'ఎక్స్'లో ఒక పోస్ట్ పెట్టారు.
ఈ సందర్భంగా కేటీఆర్ స్పందిస్తూ.. "అసాధ్యమైన కలలు కనడమే కాదు... వాటిని నిజం చేసుకోవడానికి చేసే స్ఫూర్తిదాయకమైన ప్రయాణాన్ని ఈ చిత్రం ఎంతో అందంగా ఆవిష్కరించింది. 'ఆకాశంలో ఒక తార' చాలా సరళంగా, అద్భుతంగా ఉంది. చాలా కాలం తర్వాత ఇంతటి అందమైన సినిమాను చూశాను. ముఖ్యంగా దుల్కర్ సల్మాన్, శ్రుతిహాసన్ తమ అద్భుతమైన నటనతో ఆకట్టుకున్నారు. ఇక ఈ సినిమాతో పరిచయమైన సాత్విక తొలి చిత్రంతోనే అద్భుతమైన ప్రతిభను చాటుకున్నారు. ఆమె నటనకు ప్రత్యేకంగా అభినందనలు. దర్శకుడు పవన్ సాధినేని కూడా అద్భుతమైన పనితీరును కనబరిచారు. అద్భుతమైన సినిమా అందించిన చిత్ర బృందానికి అభినందనలు" అని రాసుకొచ్చారు.
పవన్ సాధినేని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో దుల్కర్ సల్మాన్, సాత్విక వీరవల్లి ప్రధాన పాత్రలు పోషించగా, శ్రుతిహాసన్ కీలక పాత్రలో మెరిశారు. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా సంయుక్తంగా సమర్పించిన ఈ చిత్రం మంచి టాక్ సాధించింది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

మూడు కోట్లు మాయమైతే న్యాయం ఎప్పుడు.?

రెండేళ్లకు పైగా సాగుతున్న సైబర్ క్రైమ్ దర్యాప్తు..

బాధితుడి ఆవేదనపై ఉన్నతాధికారులు స్పందించాలి..

దర్యాప్తు జాప్యంపై సమీక్ష జరగాలి..

బాధ్యతారాహిత్యంపై చర్యలు తీసుకోవాలి..



హైదరాబాద్,(ప్రజావినికిడి): నవంబర్ 27,

సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని జీవితకాలం సంపాదించిన ఆస్తులను కోల్పోయిన ఓ బాధితుడికి న్యాయం అందించాల్సిన బాధ్యత పోలీసు వ్యవస్థపై ఉంది. అయితే రూ.3.12 కోట్ల భారీ ఆర్థిక మోసం కేసులో రెండేళ్లకు పైగా గడిచినా బాధితుడికి న్యాయం అందలేదనే ఆవేదన వ్యక్తమవుతోంది. కేసు దర్యాప్తు ఏ దశలో ఉంది? నిందితుల నుంచి సొమ్ము రికవరీకి ఎలాంటి చర్యలు తీసుకున్నారు.? బాధితుడి ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిగిందా? అనే ప్రశ్నలు ఇప్పుడు ఉత్పన్నమవుతున్నాయి.

స్నేహం ముసుగులో ఆర్థిక మోసం?

రాచకొండ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నంబర్ 373/2024 కేసు వివరాల ప్రకారం..రామంతాపూర్‌కు చెందిన పుట్టా బాలకృష్ణ అనే వ్యాపారి అమెరికన్ ఎక్స్‌ప్రెస్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ పేరుతో భారీగా మోసపోయినట్లు ఫిర్యాదు చేశారు. 2020లో పరిచయమైన వ్యక్తి ద్వారా పాలసీకి సంబంధించిన లావాదేవీలు ప్రారంభమయ్యాయని, పెట్టుబడి మొత్తం లాభాలతో తిరిగి వస్తుందని నమ్మించారని బాధితుడు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం పలు బ్యాంకు ఖాతాల నుంచి విడతలవారీగా రూ.3,12,00,000 బదిలీ చేసినట్లు తెలిపారు.

పాలసీ,జీఎస్టీ,ఆడిటింగ్ ఫీజులు, ఆదాయపు పన్ను తదితర కారణాలు చూపిస్తూ మరిన్ని డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేయడంతో అనుమానం వచ్చిందని బాధితుడు వివరించారు. తనకు జరిగిన నష్టంపై విచారణ జరిపి న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించారు.

ఎఫ్ఐఆర్ నమోదైంది..దర్యాప్తు ఎక్కడి వరకు.?

బాధితుడి ఫిర్యాదు ఆధారంగా 27 ఫిబ్రవరి 2024న రాచకొండ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 373/2024 కింద కేసు నమోదైంది.అప్పటి ఎఫ్ఐఆర్‌లో ఐపీసీ సెక్షన్లు 406,419, 420తో పాటు ఐటీ చట్టంలోని 66సీ,66డి సెక్షన్లు నమోదు చేసినట్లు పత్రాలు వెల్లడిస్తున్నాయి. దర్యాప్తులో భాగంగా ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. బ్యాంకు ఖాతాల వివరాలు సేకరించడం, ఎలక్ట్రానిక్ పరికరాలు, చెక్‌బుక్‌లు, పాస్‌బుక్‌లు, వాహనాలు తదితరాలను స్వాధీనం చేసుకున్నట్లు పత్రాల్లో వివరించారు.

అయితే ఇంత భారీ మొత్తానికి సంబంధించిన కేసులో ఇప్పటివరకు దర్యాప్తు ఏ స్థాయికి చేరింది? స్వాధీనం చేసుకున్న పరికరాల నుంచి కీలక ఆధారాలు వెలికితీశారా? నిందితుల ఖాతాలకు వెళ్లిన సొమ్ములో ఎంత మొత్తాన్ని గుర్తించారు? ఎంత రికవరీ చేశారు? అనే అంశాలపై బాధితుడికి స్పష్టమైన సమాచారం అందాల్సిన అవసరం ఉంది.

కొత్తగా వచ్చాను..చూస్తాను అనే సమాధానంతో సరిపోతుందా?

కేసు దర్యాప్తు పురోగతిపై బాధితుడు పోలీసులను సంప్రదించినప్పుడు, కొత్తగా బాధ్యతలు చేపట్టిన సీఐ పరిశీలించి చర్యలు తీసుకుంటానని చెప్పినట్లు బాధితుడు చెబుతున్నారు. అయితే, బాధితుడి వాదన ప్రకారం ఇప్పటికీ ఆశించిన పురోగతి కనిపించడం లేదు. అధికారులు బదిలీ కావడం,కొత్త అధికారులు బాధ్యతలు స్వీకరించడం సహజమైన పరిపాలనా ప్రక్రియ.కానీ బాధితుడికి న్యాయం అందించే బాధ్యత మాత్రం మారదు.కేసు పూర్వాపరాలు తెలుసుకుని, ఇప్పటికే సేకరించిన ఆధారాలను సమీక్షించి, దర్యాప్తును ముందుకు తీసుకెళ్లడం సంబంధిత అధికారుల బాధ్యత.ప్రజల పన్నులతో వేతనాలు పొందుతున్న ప్రభుత్వ అధికారులు,ముఖ్యంగా ప్రజల ఆస్తి,ప్రాణాలకు సంబంధించిన ఫిర్యాదులపై స్పందించాల్సిన బాధ్యత కలిగిన పోలీసు అధికారులు,
తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలి. భారీ ఆర్థిక నేరాల దర్యాప్తులో జాప్యం ఎందుకు జరుగుతోందో సంబంధిత ఉన్నతాధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది.

బెయిల్‌పై బయట ఉన్నారంటే కేసు ముగిసినట్లా?

ఈ కేసులో నిందితులు బెయిల్‌పై బయట ఉన్నారని,బాధితుడికి మాత్రం న్యాయం అందడం లేదని ఫిర్యాదుదారుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అయితే బెయిల్‌పై విడుదల కావడం నిందితులు నిర్దోషులని నిర్ధారించదు. అదే సమయంలో, నిందితులపై ఆరోపణలు ఉన్నంత మాత్రాన వారు దోషులుగా నిర్ధారించబడినట్లు కూడా కాదు. న్యాయస్థానం నిర్ణయం, దర్యాప్తులో సేకరించిన ఆధారాలు, తదుపరి న్యాయప్రక్రియ ఆధారంగానే కేసు ముందుకు సాగాలి.అయినప్పటికీ,బెయిల్‌పై ఉన్న నిందితులపై దర్యాప్తు కొనసాగించడానికి చట్టం కల్పించిన అవకాశాలను సంబంధిత అధికారులు సమర్థవంతంగా వినియోగిస్తున్నారా? బాధితుడి సొమ్ము ఎక్కడికి వెళ్లిందో గుర్తించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారా? అనే ప్రశ్నలకు సమాధానం రావాలి.

లిబాధితుడి ఆస్తులు..కుటుంబ భవిష్యత్తులి
తనకు ఇద్దరు కుమార్తెలు,ఒక కుమారుడు ఉన్నారని,కుమార్తెల వివాహాల కోసం సంపాదించిన ఆస్తులను వినియోగించాలనే ఆశతో పాలసీకి దబ్బులు చెల్లించినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు.తన ఆస్తులు,కుటుంబ సభ్యుల బంగారం కూడా ఈ వ్యవహారంలో వినియోగించాల్సి వచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఒక వ్యక్తి ఆర్థికంగా నష్టపోవడం మాత్రమే కాదు అతని కుటుంబ భవిష్యత్తు,పిల్లల జీవితాలు కూడా ప్రభావితమయ్యే పరిస్థితి ఏర్పడింది.ఇలాంటి కేసుల్లో దర్యాప్తు జాప్యం బాధితుడి ఆందోళనను మరింత పెంచుతుంది.

ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలి

రూ.3.12 కోట్ల మోసం కేసులో దర్యాప్తు పురోగతిపై రాచకొండ పోలీసు కమిషనర్,సైబర్ క్రైమ్ విభాగం ఉన్నతాధికారులు ప్రత్యేకంగా సమీక్షించాలని బాధితుడు కోరుతున్నారు.
కేసులో ఇప్పటివరకు జరిగిన దర్యాప్తు, సేకరించిన ఆధారాలు,స్వాధీనం చేసుకున్న ఆస్తులు,బ్యాంకు లావాదేవీల విశ్లేషణ,సొమ్ము రికవరీ ప్రయత్నాలపై సమగ్ర నివేదిక రూపొందించాలి.దర్యాప్తులో ఏవైనా లోపాలు,అనవసర జాప్యాలు ఉన్నాయా అనే అంశాన్ని పరిశీలించాలి.
విధి నిర్వహణలో నిర్లక్ష్యం లేదా ఉద్దేశపూర్వక జాప్యం జరిగినట్లు ఆధారాలతో తేలితే, సంబంధిత అధికారులపై వర్తించే చట్టాలు, సేవా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి.అదే సమయంలో, నిందితులపై ఆరోపణలను నిర్ధారించే ఆధారాల సేకరణ,ఆర్థిక లావాదేవీల పరిశీలన, చట్టబద్ధమైన రికవరీ చర్యలను వేగవంతం చేయాలి.
బాధితుడికి కేసు ప్రస్తుత స్థితి, ఇప్పటివరకు జరిగిన దర్యాప్తు, తదుపరి చర్యలపై స్పష్టమైన సమాచారం అందించాలి. దర్యాప్తు ఎప్పుడు పూర్తవుతుందో,బాధితుడి నష్టాన్ని పూడ్చేందుకు చట్టపరంగా ఏ చర్యలు తీసుకుంటున్నారో తెలియజేయాలి.న్యాయం ఆలస్యమైతే బాధితుడి నమ్మకం దెబ్బతింటుంది. రూ.3.12 కోట్ల కేసులో దర్యాప్తు పురోగతిపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత పోలీసు వ్యవస్థపై ఉంది. బాధితుడికి న్యాయం అందించడమే కాదు.. దర్యాప్తుపై ప్రజల్లో నమ్మకం నిలబెట్టడం కూడా అధికారుల బాధ్యత.

నోటీసులు ఇవ్వాలి.. సెటిల్మెంట్లు చేసుకోవాలి..



సరూర్‌నగర్ సర్కిల్‌లో అక్రమ నిర్మాణాల పరంపర..

అక్రమాలకు అండగా న్యాక్ ఇంజనీర్ సురేష్, సెక్షన్ ఆఫీసర్ సోమేశ్వర్.?

ఫోన్ చేసినా ఎత్తని న్యాక్ ఇంజనీర్ సురేష్.. జోనల్ కమిషనర్ కంటే పెద్ద అధికారా.?

ఇన్‌చార్జ్ ఏసీపీ,డీసీ,జెడ్సీ ఉన్నా చర్యలు శూన్యం..

ఆర్థిక లావాదేవీల ఆరోపణలతో అధికారులపై స్థానికుల ఆగ్రహం..



ఎల్బీనగర్,(ప్రజావినికిడి):

సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాల జోరు కొనసాగుతున్నా..వాటిని అడ్డుకోవాల్సిన జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు మాత్రం నిద్రావస్థలో ఉన్నారా.? అక్రమ నిర్మాణాలపై నోటీసులు ఇవ్వడం,ఆ తర్వాత సెటిల్మెంట్లతో వ్యవహారాలను చక్కదిద్దుకోవడమే కొందరు అధికారుల విధిగా మారిందా.? అన్న అనుమానాలు స్థానిక ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. నగరాభివృద్ధి, ప్రజల భద్రత, ఎంఎంసి ఆదాయ పరిరక్షణకు బాధ్యత వహించాల్సిన అధికారులు మౌనం వహించడం విమర్శలకు తావిస్తోంది.సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని పక్కింటి నంబర్ 23-62, ఒక నిర్మాణము.డిగ్రీ కళాశాల ముందు మరొక భారీ నిర్మాణం జరుగుతున్న నిర్మాణాలపై స్థానికులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణాలకు పూర్తి అనుమతులు ఉన్నాయా.? అనుమతులకు మించి అంతస్తులు నిర్మిస్తున్నారా.? నిబంధనలకు విరుద్ధంగా పనులు జరుగుతున్నాయా.? ఎన్ని నోటీసులు ఇచ్చారు.? ఏమి చర్యలు తీసుకున్నారు.? నిర్మాణాల వద్ద పర్మిషన్, ప్లాన్ కాపీ అంటించాలి. ఎందుకు అంటించలేదు.? అన్న విషయాలను పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిన అధికారుల స్పందన మాత్రం కనిపించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.అక్రమ నిర్మాణాలకు న్యాక్ ఇంజనీర్ సురేష్,సెక్షన్ ఆఫీసర్ సోమేశ్వర్ పూర్తిగా సహకరిస్తున్నారంటూ స్థానికులు ఆరోపణలు చేస్తున్నారు.ఈ ఆరోపణలపై అధికారుల వివరణ తీసుకునేందుకు న్యాక్ ఇంజనీర్ సురేష్‌కు పలుమార్లు ఫోన్ చేసినా స్పందించలేదని, అసలు ఎవరి ఫోన్ ఎత్తరు అని ఒక ఔట్సోర్సింగ్ ఉద్యోగి ఇంత అక్రమాలకు బాధ్యతారాహిత్యానికి పాల్పడడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని ఏ అధికారి ఇతనికి అండగా ఉన్నారో పూర్తిస్థాయిలో విచారణ చేయిస్తారని స్థానికులు కోరుతున్నారు. జోనల్ కమిషనర్ కంటే ఇంజనీర్ సురేష్ పెద్ద అధికారా.? అందుకోసమే ఎవరి ఫోన్ ఎత్తడా అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఏసీపీ,డిప్యూటీ కమిషనర్ పర్యవేక్షణ ఎక్కడ.?

ఇక ఇన్‌చార్జ్ ఏసీపీ పర్యవేక్షణ ఎక్కడ.? డిప్యూటీ కమిషనర్ బాధ్యత ఏమిటి.? అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వస్తున్నా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు.? అన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.ఆర్థిక లావాదేవీల కారణంగానే అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.



జోనల్ కమిషనర్ నిర్లక్ష్యంతో అక్రమ నిర్మాణాల జోరా.?

ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ నిర్లక్ష్యంతోనే అక్రమ నిర్మాణాలపై చర్యలు లేకపోవడం జీహెచ్ఎంసీ ఆదాయానికి గండికొడుతోందని ప్రజలు విమర్శిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధమైన నిర్మాణాలపై నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకోవడం కాదు. నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అక్రమాలు నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు సూచిస్తున్నారు.
అక్రమ నిర్మాణాలపై విచారణ ఎప్పుడు.? బాధ్యులపై చర్యలు ఎప్పుడు.? సరూర్‌నగర్ ప్రజల ప్రశ్నలకు మున్సిపల్ ఉన్నతాధికారులు సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చిందని స్థానికులు పేర్కొన్నారు.



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

హైదరాబాద్ మార్కెట్లలో కుళ్లిన చేపలు

: టీజీ సేఫ్ తనిఖీల్లో బయటపడిన వాస్తవాలు

బేగంబజార్, రాంనగర్ మార్కెట్లలో భారీగా కుళ్లిపోయిన చేపలు స్వాధీనం

రాంనగర్‌లో రెండు చేపల దుకాణాల మూసివేతకు నోటీసులు

చేపల్లో ఫార్మాలిన్ కలిపారా? .. ల్యాబ్‌కు శాంపిల్స్ పంపిన అధికారులు





నవంబర్ 27 (ప్రజావినికిడి):

హైదరాబాద్ నగరంలోని పలు చేపల మార్కెట్లలో ఆహార భద్రతా ప్రమాణాలను ఉల్లంఘిస్తున్న వ్యాపారులపై తెలంగాణ ఫుడ్ సేఫ్టీ (టీజీ-సేఫ్) విభాగం అధికారులు కొరడా ఝుళిపించారు. ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా వెటర్నరీ అధికారులతో కలిసి ఈరోజు బేగంబజార్, రాంనగర్, ముషీరాబాద్ ప్రాంతాల్లోని మార్కెట్లలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సోదాల్లో మానవ వినియోగానికి ఏమాత్రం పనికిరాని, తీవ్రంగా పాడైపోయిన చేపలను పెద్ద ఎత్తున గుర్తించి అక్కడికక్కడే పారబోశారు.

తనిఖీల్లో భాగంగా బేగంబజార్‌లోని జీఎన్‌బీ శ్రీ శ్రీనివాస ఫిష్ మర్చంట్ దుకాణంలో సుమారు 70 కిలోల కుళ్లిన బొచ్చె (కట్ల) చేపలను అధికారులు తొలగించారు. అలాగే రాంనగర్‌లోని బిస్వస్ ఫిషరీలో 65 కిలోలు, ముషీరాబాద్‌లోని జీబీకే ఫిషరీస్‌లో 30 కిలోలు, ఎస్వీఆర్ షాపులో 35 కిలోల తిలాపియా చేపలతో పాటు ఇతర దుకాణాల్లో అపరిశుభ్రంగా నిల్వ ఉంచిన చేపలను గుర్తించి సీజ్ చేశారు. నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘించిన రాంనగర్‌లోని రెండు వ్యాపార సంస్థలకు అధికారులు క్లోజర్ నోటీసులు జారీ చేశారు.

చేపలు ఎక్కువ రోజులు తాజాగా కనిపించేందుకు వ్యాపారులు ఫార్మాలిన్, నైట్రేట్ వంటి హానికర రసాయనాలను వాడుతున్నారా అనే కోణంలో అధికారులు ప్రాథమిక పరీక్షలు చేపట్టారు. మరింత సమగ్ర విశ్లేషణ కోసం చేపల నమూనాలను సేకరించి స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీకి పంపించారు. తప్పనిసరిగా ఉండాల్సిన ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులు లేకుండా, అపరిశుభ్ర పరిస్థితుల్లో విక్రయాలు సాగిస్తున్న పలువురు వ్యాపారులకు నోటీసులు అందజేశారు. నిబంధనలు పాటించకుండా కుళ్లిన ఆహార పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు.

కార్మిక ఉద్యమ నేతకు జాతీయ స్థాయిలో గుర్తింపు

ఏఐటీయూసీ జాతీయ సమితి సభ్యుడిగా పానుగంటి పర్వతాలు ఏకగ్రీవ ఎన్నిక



రాజేంద్రనగర్, (ప్రజావినికిడి): నవంబర్ 27,

కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ, సంఘం బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తున్న పానుగంటి పర్వతాలుకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఏఐటీయూసీ జాతీయ సమితి సభ్యుడిగా ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూరులో నవంబర్ 22 నుంచి 26 వరకు నిర్వహించిన ఏఐటీయూసీ 43వ జాతీయ మహాసభల్లో దేశవ్యాప్తంగా పాల్గొన్న కార్మిక సంఘాల ప్రతినిధులు పానుగంటి పర్వతాలును జాతీయ సమితి సభ్యుడిగా ఎన్నుకున్నారు. కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, సంఘం అభివృద్ధికి ఎన్నో ఏళ్లుగా చేసిన కృషికి ఈ ఎన్నిక గుర్తింపుగా నిలిచింది.గల్లీ స్థాయి నుంచి తన ప్రస్థానాన్ని ప్రారంభించిన పర్వతాలు కార్మికుల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, సంఘటిత ఉద్యమాల బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తూ అంచెలంచెలుగా ఎదిగారు. తాజాగా జాతీయ సమితిలో చోటు దక్కించుకోవడంతో రంగారెడ్డి జిల్లాలోని ఏఐటీయూసీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ,రాష్ట్రంతో పాటు రంగారెడ్డి జిల్లాలో ఏఐటీయూసీని మరింత విస్తరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణకు నిరంతరం అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. తనను జాతీయ సమితి సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న నాయకులకు, ప్రతినిధులకు, సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.స్థానిక స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు సాగిన పానుగంటి పర్వతాలు ప్రస్థానం కార్మిక సంఘాల్లో ఆయన చేసిన సేవలకు లభించిన గుర్తింపుగా నిలిచింది.

ఏపీలో డిప్యూటీ మేయర్ ఎన్నికలకు ముహూర్తం ఫిక్స్.. డిసెంబరు 5న పోలింగ్



అమరావతినవంబర్ 27 (ప్రజావినికిడి):

ఏపీలో పట్టణ స్థానిక సంస్థల పరోక్ష ఎన్నికలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా నోటిఫికేషన్ విడుదల చేశారు. 4 మున్సిపల్ కార్పొరేషన్లు, 19 మున్సిపాలిటీలు/నగర పంచాయతీల పరోక్ష ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించారు. డిసెంబరు 5వ తేదీ ఉదయం 11 గంటలకు డిప్యూటీ మేయర్, వైస్ ఛైర్‌పర్సన్ పదవులకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

డిసెంబరు 5వ తేదీన ఎన్నిక జరగకపోతే, మరుసటి రోజు డిసెంబరు 6వ తేదీన జరుపుతున్నట్లు ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా వెల్లడించారు. డిసెంబరు 1వ తేదీన లేదా అంతకుముందే ప్రత్యేక సమావేశాలకు సంబంధించి సభ్యులకు నోటీసులు జారీ చేశారు. శ్రీకాకుళం, కాకినాడ, రాజమహేంద్రవరం, మంగళగిరి – తాడేపల్లి కార్పొరేషన్లలో డిప్యూటీ మేయర్ ఎన్నికలు నిర్వహించనున్నారు. గతంలో వాయిదా పడిన నర్సీపట్నం, మాచర్ల మున్సిపాలిటీల వైస్ ఛైర్‌పర్సన్ పదవులకు కూడా డిసెంబరు 5వ తేదీనే ఎన్నికలు జరగనున్నాయి.నిన్న (గురువారం) పోలింగ్ ముగిసిన ఈ స్థానిక సంస్థల ఓట్ల లెక్కింపు, ఫలితాలను నవంబరు 30వ తేదీన వెల్లడించనున్నారు. చేతులెత్తే పద్ధతిలో పరోక్ష ఎన్నికలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు, అధికారులు సహకరించాలని ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా విజ్ఞప్తి చేశారు.

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

: డిసెంబర్ 2న వాయుగుండంగా మారే అవకాశం



అమరావతి నవంబర్ 27 (ప్రజావినికిడి):

బంగాళాఖాతంలో మరో వాతావరణ మార్పు చోటుచేసుకోనుంది. సముద్రంలో కొత్తగా అల్పపీడనం పుంజుకునే సూచనలు కనిపిస్తున్నట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. దక్షిణ అండమాన్ పరిసరాల్లో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనమే దీనికి కారణంగా నిలవనుంది.ఈ ఆవర్తన ప్రభావం వల్ల నవంబర్ 30 నాటికి అండమాన్, ఆగ్నేయ బంగాళాఖాతం పరిధిలో అల్పపీడనం రూపుదిద్దుకోనుంది. ఆ తర్వాత ఇది క్రమంగా మరింత శక్తిని పుంజుకోనుంది. డిసెంబర్ 2 నాటికి ఇది వాయుగుండంగా రూపాంతరం చెందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.ఈ వాయుగుండం పశ్చిమ వాయవ్య దిశగా పయనించే అవకాశముంది. తమిళనాడు లేదా శ్రీలంక తీరాల వైపు ఇది వెళ్లొచ్చని అధికారులు భావిస్తున్నారు. అయితే తీరం దాటకముందే సముద్రంలోనే ఇది శక్తిని కోల్పోయి బలహీనపడే సంకేతాలు కూడా ఉన్నాయని వాతావరణ విశ్లేషణల ద్వారా స్పష్టమవుతోంది.

ఆత్మీయుల మధ్య నర్ర గిరి జన్మదిన వేడుకలు

పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కారం..

పెద్ద సంఖ్యలో హాజరైన సీపీఐ, ఇతర పార్టీల నాయకులు



శంషాబాద్, (ప్రజావినికిడి): నవంబర్ 27, సీపీఐ మండల కార్యదర్శి నర్ర గిరి జన్మదిన వేడుకలు శంషాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం శంషాబాద్ పురపాలక పరిధిలోని ఎలైట్ హోటల్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమక్షంలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా నర్ర గిరికి నాయకులు పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పలువురు నాయకులు ఆయనతో కేక్ కట్ చేయించి తమ అభినందనలు తెలిపారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో కొనసాగింది. ఈ వేడుకలకు సీపీఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు,జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్. యాదగిరి,జిల్లా సమితి సభ్యులు ఆనంద్ గౌడ్, బీఆర్ఎస్ యువ నాయకుడు అన్నెపు ప్రభు ముదిరాజ్ తదితరులు హాజరై నర్ర గిరికి శుభాకాంక్షలు తెలిపారు.అలాగే గిలక రాజు, నరేష్ నాయక్, శ్రీను,దండు రవికుమార్,నర్ర యాదయ్య, మల్లేష్, నీలమ్మతో పాటు నర్ర గిరి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో మరో నియోపాలిస్..

మియాపూర్ భూములపై హెచ్ఎండీఏ మెగా ప్లాన్!



నవంబర్ 27 (ప్రజావినికిడి):కోకాపేట, బుద్వేల్ భూముల వేలంతో ప్రభుత్వ ఖజానాకు వేల కోట్ల రూపాయల ఆదాయాన్ని సమకూర్చుకున్న తెలంగాణ ప్రభుత్వం.. ఇప్పుడు అదే బాటలో మరో భారీ ప్రణాళికకు శ్రీకారం చుట్టింది. హైదరాబాద్‌లో అత్యంత కీలకమైన మియాపూర్ ప్రాంతంలోని విలువైన ప్రభుత్వ భూములను అభివృద్ధి చేసి, విక్రయించడం ద్వారా భారీగా నిధులు సమీకరించాలని నిర్ణయించింది. ఈ మేరకు శేరిలింగంపల్లి మండల పరిధిలోని సర్వే నంబర్లు 100, 101లలో ఉన్న భూముల్లో మెగా లేఅవుట్ అభివృద్ధి చేసే బాధ్యతను హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ)కు అప్పగించింది.దాదాపు 23 సంవత్సరాలుగా ప్రైవేటు వ్యక్తులు, సొసైటీలతో నడిచిన న్యాయపోరాటంలో ఇటీవలే సుప్రీంకోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వెలువరించింది. మొత్తం 550 ఎకరాల భూమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేయడంతో, ఈ భూములను అభివృద్ధి చేసేందుకు మార్గం సుగమమైంది. తీర్పు అనంతరం రంగారెడ్డి జిల్లా కలెక్టర్, హెచ్ఎండీఏ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి భూములను స్వాధీనం చేసుకున్నారు. ముంబై జాతీయ రహదారికి కేవలం అర కిలోమీటరు దూరంలో ఉండటంతో ఈ భూములకు భారీ డిమాండ్ ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న భూమిలో సుమారు 110 నుంచి 150 ఎకరాల వరకు ఆక్రమణల్లో ఉన్నాయి. ఇక్కడ ఇప్పటికే బస్తీలు, కాలనీలు వెలిశాయి. వీటిని ప్రస్తుతానికి తొలగించే పరిస్థితి లేనందున, దీనిపై ప్రభుత్వ స్థాయిలో విధానపరమైన నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఆక్రమణలు పోగా, సుమారు 386 నుంచి 400 ఎకరాల భూమి లేఅవుట్ అభివృద్ధికి అందుబాటులో ఉంది. ఈ భూమిలో విశాలమైన రహదారులు, పార్కులు, గ్రీన్ స్పేస్, ఇతర సామాజిక మౌలిక వసతులు కల్పించేందుకు హెచ్ఎండీఏ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.లేఅవుట్ అభివృద్ధి పనుల కోసం సుమారు రూ. 600 నుంచి 700 కోట్లు ఖర్చవుతుందని అంచనా. అభివృద్ధి పనులు పూర్తయ్యాక, కోకాపేట నియోపాలిస్ తరహాలోనే ఇక్కడ కూడా ప్లాట్లను ఈ-వేలం ద్వారా విక్రయించనున్నారు. ఈ వేలం ద్వారా ప్రభుత్వానికి భారీ ఆదాయం లభిస్తుందని, ఆ నిధులను ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. త్వరలోనే లేఅవుట్ అభివృద్ధి పనులు ప్రారంభించి, వేలానికి సంబంధించిన ప్రకటన విడుదల చేసేందుకు హెచ్ఎండీఏ కసరత్తు చేస్తోంది.

నషా ముక్త్ భారత్.. కిషన్ రెడ్డి పాదయాత్రలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించిన నాగార్జున

నషా ముక్త్ భారత్.. డ్రగ్స్ కు వ్యతిరేకంగా కేంద్రం జాతీయ కార్యక్రమం

కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ లో పాదయాత్ర

మూడో రోజు యాత్రలో పాల్గొన్న అగ్రనటుడు నాగార్జున

డ్రగ్స్ రహిత భారత్ కోసం ప్రతిజ్ఞ చేయించిన నాగార్జున

యాత్రకు మద్దతు తెలిపిన పలువురు సినీ ప్రముఖులు

ముగింపు వేడుకకు చిరంజీవి, శ్రీశ్రీ రవిశంకర్ హాజరు



నవంబర్ 27 (ప్రజావినికిడి):

మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి హైదరాబాద్‌లో చేపట్టిన పాదయాత్రకు సినీ ప్రముఖుల నుంచి విశేష మద్దతు లభిస్తోంది. 'హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్' పేరుతో మూడు రోజులుగా జరుగుతున్న ఈ యాత్ర చివరి రోజైన శుక్రవారం, ప్రముఖ నటుడు నాగార్జున అక్కినేని పాల్గొన్నారు. ఈ సందర్భంగా డ్రగ్స్ రహిత సమాజం కోసం ఆయన ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.

అంబర్‌పేట్‌లో ప్రారంభమైన ఈ పాదయాత్ర ముగింపు రోజున అమీర్‌పేట వద్ద నాగార్జున జత కలిశారు. ఆయనతో పాటు నటుడు సాయికుమార్, దర్శకుడు బోయపాటి శ్రీను, హాస్యనటుడు శివారెడ్డి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పించిన 'నషా ముక్త్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా ఈ యాత్ర జరగడం అభినందనీయమన్నారు. ఈ బృహత్ కార్యక్రమంలో సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

"వ్యక్తిగతంగా నేను డ్రగ్స్‌కు దూరంగా ఉండటమే కాకుండా, నా కుటుంబాన్ని, స్నేహితులను, చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా డ్రగ్స్ బారిన పడకుండా కాపాడేందుకు అన్ని విధాలా ప్రయత్నిస్తాను" అని నాగార్జున ప్రతిజ్ఞ చేయించారు. నటుడు సాయికుమార్ 'నషా ముక్త్ భారత్ - మేం చేసి తీరుతాం' అంటూ నినాదాలతో హోరెత్తించారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ఢిల్లీలో అత్యవసర కేబినెట్ సమావేశం ఉన్నప్పటికీ, పాదయాత్రను కొనసాగించాలని ప్రధానమంత్రి తనకు సూచించారని తెలిపారు. ప్రజల నుంచి యాత్రకు అద్భుతమైన స్పందన వస్తోందన్నారు. జూబ్లీహిల్స్‌లో జరిగే ముగింపు కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవిశంకర్ హాజరవుతారని వెల్లడించారు.

'నషా ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా జరుగుతున్న ఈ కార్యక్రమంలో ఇప్పటికే బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ వంటి ప్రముఖులు కూడా పాల్గొని తమ మద్దతు తెలిపారు. యువతను మాదకద్రవ్యాల మహమ్మారి నుంచి రక్షించడానికి సామూహిక బాధ్యతతో పనిచేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.



దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం జరగాలి!

జనాభా లెక్కలతోనే ప్రజాస్వామ్య విలువలను కొలుస్తారా?

నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం జరగాలి!



అమరావతి నవంబర్ 27 (ప్రజావినికిడి):

భారత ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడి ఓటుకు సమాన విలువ ఉండాలన్నది రాజ్యాంగ స్ఫూర్తి. జనాభాకు అనుగుణంగా ప్రజాప్రతినిధుల సంఖ్య ఉండాలన్నది కూడా ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన సూత్రం. అయితే దేశంలో నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశం ఇప్పుడు కేవలం ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన విషయంగా మిగలలేదు. దేశ సమాఖ్య వ్యవస్థ, రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం, కేంద్రంలో దక్షిణాది రాష్ట్రాల గొంతుకకు సంబంధించిన కీలక చర్చగా మారింది.

దేశంలో చివరిసారిగా 1971 జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ స్థానాల రాష్ట్రాలవారీ కేటాయింపును స్థిరీకరించారు. జనాభా నియంత్రణ చర్యలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ పరిమితిని 2026 తర్వాత జరిగే తొలి జనగణన గణాంకాలు ప్రచురితమయ్యే వరకు పొడిగించారు. ఇప్పుడు ఆ గడువు సమీపిస్తున్న నేపథ్యంలో నియోజకవర్గాల పునర్విభజనపై చర్చ మళ్లీ తెరపైకి వచ్చింది.

జనాభా పెరుగుదల ఆధారంగా లోక్‌సభ స్థానాలను పునఃకేటాయిస్తే ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ స్థానాలు లభించే అవకాశం ఉందన్న ఆందోళన దక్షిణాది రాష్ట్రాల్లో వ్యక్తమవుతోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలు గత కొన్ని దశాబ్దాలుగా కుటుంబ నియంత్రణ, విద్య, ఆరోగ్య రంగాల్లో చేపట్టిన చర్యలతో జనాభా పెరుగుదలను నియంత్రించాయి. ఇప్పుడు అదే కారణంతో పార్లమెంటులో తమ ప్రాతినిధ్య వాటా తగ్గితే ఎలా? అన్న ప్రశ్న సహజంగానే ఉత్పన్నమవుతోంది.

జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం కల్పించాలనే వాదనలోనూ ప్రజాస్వామ్య సూత్రం ఉంది. అధిక జనాభా కలిగిన ప్రాంతాల్లో ఒక ఎంపీపై ఎక్కువ మంది ప్రజల బాధ్యత ఉంటుంది. అలాంటి ప్రాంతాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం కూడా ఉంది. అయితే జనాభా నియంత్రణలో ముందున్న రాష్ట్రాలకు రాజకీయంగా నష్టం కలిగించే విధానం అమలైతే, అది కేంద్రం–రాష్ట్రాల మధ్య విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది. అభివృద్ధి, జనాభా నియంత్రణలో సాధించిన విజయాలకు రాష్ట్రాలు మూల్యం చెల్లించాల్సిన పరిస్థితి రాకూడదు.

ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తాజాగా అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాలను 50 శాతం పెంచే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపినట్లు వార్తలు వెలువడ్డాయి. రాష్ట్రాల మధ్య ప్రస్తుత స్థానాల వాటాను 2051 వరకు కొనసాగించే ప్రతిపాదన కూడా చర్చలో ఉంది. ఈ విధానం దక్షిణాది రాష్ట్రాలు వ్యక్తం చేస్తున్న ఆందోళనలకు ఒక పరిష్కార మార్గంగా కనిపిస్తున్నప్పటికీ, అసలు బిల్లులోని నిబంధనలు, స్థానాల కేటాయింపు విధానం, నియోజకవర్గాల సరిహద్దుల నిర్ణయం వంటి అంశాలపై పూర్తి స్పష్టత రావాల్సి ఉంది.

మరోవైపు మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్న లక్ష్యం కూడా ఈ చర్చతో ముడిపడి ఉంది. మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరగడం స్వాగతించదగిన పరిణామమే. అయితే మహిళా రిజర్వేషన్ల అమలు పేరుతో రాష్ట్రాల మధ్య ప్రాతినిధ్య సమతుల్యతకు భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఒక హక్కును అమలు చేయడానికి మరో ప్రాంతం ఆందోళనలను నిర్లక్ష్యం చేయడం సరైన విధానం కాదు.డీలిమిటేషన్ ప్రక్రియలో కేంద్ర ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలకు తావివ్వకుండా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, రాజకీయ పక్షాలు, రాజ్యాంగ నిపుణులతో విస్తృత చర్చలు జరపాలి. జనాభా, అభివృద్ధి, జనాభా నియంత్రణలో రాష్ట్రాల ప్రగతి, భౌగోళిక పరిస్థితులు, ప్రజల ప్రాతినిధ్య అవసరాలు వంటి అంశాలను సమగ్రంగా పరిగణనలోకి తీసుకోవాలి. స్వతంత్ర డీలిమిటేషన్ కమిషన్ ద్వారా పారదర్శకమైన విధానం అమలు చేయాలి.

ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలకు ఈ అంశం అత్యంత కీలకం. పార్లమెంటులో రాష్ట్రానికి లభించే ప్రాతినిధ్యం కేంద్ర నిధులు, ప్రాజెక్టులు, జాతీయ విధానాల రూపకల్పనలో రాష్ట్ర స్వరాన్ని వినిపించడానికి అవసరం. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం కూడా రాజకీయ విభేదాలకు అతీతంగా రాష్ట్ర ప్రయోజనాలపై స్పష్టమైన వైఖరిని వెల్లడించాలి.

దేశ సమైక్యత అంటే కేవలం భౌగోళిక సమగ్రత మాత్రమే కాదు. అన్ని రాష్ట్రాలకు సముచిత గౌరవం, సమాన రాజకీయ భాగస్వామ్యం కల్పించడం కూడా. జనాభా ప్రాతినిధ్యానికి ప్రాధాన్యం ఇస్తూనే, జనాభా నియంత్రణలో విజయం సాధించిన రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడే సమతుల్య విధానమే దేశానికి అవసరం. డీలిమిటేషన్ ప్రక్రియ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలి తప్ప ప్రాంతీయ అసమానతలకు, రాష్ట్రాల మధ్య అనుమానాలకు కారణం కాకూడదు.

పంచాయతీ ఫలితం: వైసీపీ పుంజుకుందా?

అమరావతి నవంబర్ 27 (ప్రజావినికిడి):

ఏపీలో తొలి దశ పంచాయతీ ఎన్నికలు ముగిశాయి. వాటి ఫలితాలు కూడా వచ్చేశాయి. తొలిదశలో మొత్తం 3949 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు. గురువారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 వరకు పోలింగ్ నిర్వహించారు. అనంతరం.. 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపును ప్రారంభించారు. మొత్తం 3949 పంచాయతీల్లో 760 ఏకగ్రీవాలు అయ్యాయి. ఇవి పూర్తిగా కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన మద్దతు దారులు సొంతం చేసుకున్నారు. ఈ ఎన్నికల్లో పార్టీ జెండాలు ఉండవు. పార్టీ గుర్తులు కూడా ఉండవు. అయితే.. అభ్యర్థులు మాత్రం ఆయా పార్టీల నుంచి మద్దతు పొందారు. దీంతో టీడీపీ, జనసేన, బీజేపీ, వైసీపీ సహా కమ్యూనిస్టు పార్టీలు అభ్యర్థులకు అండగా ఉన్నాయి. ప్రచారం కూడా జోరుగా సాగింది. ఎన్నికలకు ముందు.. ఎన్నికల రోజు కూడా.. ఓటర్లను ఆకట్టుకునేందుకు బరిలో ఉన్న అభ్యర్థులు జోరుగా డబ్బులు, కానుకలు పంపిణీ చేయడం విశేషం. మొత్తంగా తొలిదశలో 26 జిల్లాల్లోని 3,189 సర్పంచ్ స్థానాలకు పోలింగ్ నిర్వహించారు. అలాగే, 39,832 వార్డు స్థానాలకు గాను 14,731 స్థానాలు ఏకగ్రీవం కాగా, 25,057 వార్డు స్థానాలకు ఎన్నికలు



జరిగాయి. పోలింగ్ ముగిసిన వెంటనే ఎన్నికల ఓట్ల లెక్కింపు కూడా చేపట్టారు. వీటిలో టీడీపీ, జనసేన కూటమి 903 స్థానాలు దక్కించుకుంది. వైసీపీ 124 స్థానాలు దక్కించుకోగా, ఇతర పార్టీల మద్దతుతో రంగంలోకి దిగిన అభ్యర్థులు 32 స్థానాల్లో గెలుపు గుర్రం ఎక్కారు. మొత్తంగా ఈ ఎన్నికల్లో మెజారిటీ సీట్లను మరోసారి కూటమి కైవసం చేసుకుంది. ఇక్కడ కూడా పూర్తిగా బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు నిర్వహించారు.

వైసీపీ విషయానికి వస్తే.. పార్టీ పంచాయతీ ఎన్నికల్లోనూ పెద్దగా పుంజుకోలేదు. నిజానికి గ్రామీణ రాజకీయాల్లోను.. గ్రామీణ ప్రాంతాల్లోనూ వైసీపీకి బలమైన మద్దతు ఉండేది. వైఎస్ రాజశేఖర రెడ్డి హవా కనిపించేది. అయితే.. తాజాగా ఆ పరిస్థితి పూర్తి భిన్నంగా మారింది. కూటమినే ప్రజలు ఎక్కువగా గెలిపించారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించే కార్యక్రమాలు చేపట్టడంతో వైసీపీని పూర్తిగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు పక్కన పెట్టినట్లు కనిపిస్తోంది.

నేను ఇక్కడే ఉన్నా.. దమ్ముంటే పట్టుకోండి

: పోలీసులకు అభిజిత్ దీప్కే సవాల్

నవంబర్ 27 (ప్రజావినికిడి):



తనపై ముంబై పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేయడంపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే తీవ్రంగా స్పందించారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ సంవిధాన్ చౌక్‌లో జరిగిన 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, రాజ్యాంగాన్ని కాపాడండి' నిరసన ర్యాలీలో ఆయన మాట్లాడారు. తాను ఎక్కడికీ పారిపోలేదని, దమ్ముంటే తనను అరెస్ట్ చేయాలంటూ అక్కడే ఉన్న పోలీసులకు బహిరంగ సవాల్ విసిరారు.బహిరంగ సభలో అభిజిత్ దీప్కే మాట్లాడుతూ... "నాపై ముంబై పోలీసులు లుకౌట్ నోటీస్ జారీ చేశారు. ఇక్కడ పోలీస్ బందోబస్తు ఉంది. వారు నా కోసం వెతుకుతున్నారు. నేను ఇక్కడే సంవిధాన్ చౌక్‌లో ఉన్నాను. నన్ను అరెస్ట్ చేయండి. నేను రెండుసార్లు జైలుకు వెళ్లాను. నాకు జైలు భయాన్ని చూపించాలనుకోకండి.. నాకు కొత్తేం కాదు" అని అన్నారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని, దేశంలోని ప్రతి వ్యవస్థను హైజాక్ చేసిందని ఆయన ఆరోపించారు. ప్రజలు 12 ఏళ్లుగా భయంతో బతికారని, అయితే జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసన ప్రజలకు మళ్లీ గొంతుకను ఇచ్చిందని పేర్కొన్నారు. మరో రెండేళ్లపాటు ఎంత భయాన్ని సృష్టించుకుంటారో సృష్టించుకోవాలని, 2029 సమీపిస్తోందని హెచ్చరించారు.ఇదే కార్యక్రమంలో లుకౌట్ నోటీసులు ఎదుర్కొంటున్న మరో సీజేపీ నేత అశుతోష్ రాంకా కూడా ప్రసంగించారు. "రాజ్యాంగాన్ని కాపాడుకోలేకపోతే, దేశాన్ని కూడా కాపాడుకోలేం" అని ఆయన అన్నారు.

శబరిమల భక్తుల కోసం కొల్లాంకు ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి ప్రత్యేక సర్వీసులు

నవంబర్ 27 (ప్రజావినికిడి):



శబరిమల అయ్యప్ప భక్తులకు భారతీయ రైల్వే శుభవార్త తెలిపింది. మండల–మకరవిళక్కు యాత్ర సీజన్ రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలుగు రాష్ట్రాల నుంచి కేరళకు నడపనున్న ప్రత్యేక రైళ్ల ముందస్తు రిజర్వేషన్లు రేపు (శనివారం) ప్రారంభం కానున్నాయి. రేపు ఉదయం 8:00 గంటల నుంచి ప్రయాణికులు ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, రైల్వే కౌంటర్ల ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. సిర్పూర్ కాగజ్‌నగర్, హైదరాబాద్‌ల నుంచి కొల్లాం వరకు ఈ వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు రాకపోకలు సాగిస్తాయి.

హైదరాబాద్ కొల్లాం ప్రత్యేక రైలు

హైదరాబాద్ – కొల్లాం ప్రత్యేక రైలు (07187) డిసెంబర్ 4, 18 తేదీల్లో (శుక్రవారాలు) ఉదయం 9:00 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 4:55 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో (07688) డిసెంబర్ 5, 19 తేదీల్లో రాత్రి 7:30 గంటలకు కొల్లాంలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 7:00 గంటలకు కాజీపేట చేరుకుని ప్రయాణాన్ని ముగిస్తుంది. ఈ రైలు లింగంపల్లి, వికారాబాద్, తాండూర్, రాయచూర్, మంత్రాలయం రోడ్, గుంతకల్, అనంతపురం, ధర్మవరం, కదిరి, మదనపల్లె, పీలేరు, చిత్తూరు మీదుగా ప్రయాణిస్తుంది.

సిర్పూర్ కాగజ్‌నగర్ కొల్లాం ప్రత్యేక రైలు

సిర్పూర్ కాగజ్‌నగర్ – కొల్లాం రైలు (07171) డిసెంబర్ 11, 25 తేదీల్లో తెల్లవారుజామున 4:00 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 4:55 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. ఈ సర్వీస్ బెల్లంపల్లి, మంచిర్యాల, రామగుండం, పెద్దపల్లి, కాజీపేట, సికింద్రాబాద్, ఏపీలోని పలు ప్రాంతాల మీదుగా నడుస్తుంది.

తిరుగు ప్రయాణంలో (07172) డిసెంబర్ 12, 26 తేదీల్లో రాత్రి 7:30 గంటలకు కొల్లాంలో బయలుదేరి, మరుసటి తెల్లవారుజామున 4:00 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుం. ఈ సర్వీస్ తిరుగు ప్రయాణంలో సిర్పూర్ కాగజ్‌నగర్ వరకు వెళ్లకుండా హైదరాబాద్‌లోనే ముగుస్తుంది.

డిసెంబర్ 27 వరకు మండల పూజలు, అనంతరం జనవరి మధ్య వరకు మకరవిళక్కు యాత్ర కొనసాగనున్నందున భక్తులు రేపు ఉదయం 8:00 గంటలకు ప్రారంభమయ్యే రిజర్వేషన్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

మెదడులో చిప్ ప్రయోగాలకు అమెరికా అనుమతి..

మస్క్‌కల సాకారం దిశగా అడుగులు!

న్యూరాలింక్ బ్రెయిన్ చిప్ తుది ప్రయోగాలకు ఎఫ్‌డీఏ ఆమోదం

ఏఎల్ఎస్ పక్షవాత బాధితులపై క్లినికల్ పరీక్షల నిర్వహణ

ఆలోచనల ద్వారానే డిజిటల్ పరికరాలను నియంత్రించే వెసులుబాటు

నానెం పరిమాణంలో పుర్రెలో అమర్చే సరికొత్త సాంకేతిక చిప్

ఇప్పటికే 30 మంది రోగులపై వేల గంటల పాటు ప్రయోగాలు

నవంబర్ 27 (ప్రజావినికిడి):



ఎలాన్ మస్క్‌కు చెందిన బ్రెయిన్–కంప్యూటర్ ఇంటర్‌ఫేస్ సంస్థ న్యూరాలింక్‌కు భారీ ఊరట లభించింది. తీవ్ర పక్షవాతానికి దారితీసే ఏఎల్ఎస్ (అమియోట్రోఫిక్ లేటరల్ స్క్లెరోసిస్) బాధితులపై బ్రెయిన్ చిప్ ప్రయోగాలకు అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ (ఎఫ్‌డీఏ) అధికారిక అనుమతి మంజూరు చేసింది. ఈ కీలకమైన 'లింక్ పివోటల్ స్టడీ'కి ఎఫ్‌డీఏ ఆమోదం తెలపడంతో, మానవ మెదడులో అమర్చే చిప్‌లను వాణిజ్యపరంగా మార్కెట్లోకి తెచ్చే దిశగా సంస్థ మరో ముందడుగు వేసింది.ఈ సరికొత్త ప్రయోగం ద్వారా బాధితులు తమ ఆలోచనలతోనే డిజిటల్ పరికరాలను ఎంతవరకు నియంత్రించగలరో నిపుణులు పరిశీలిస్తారు. తీవ్రమైన నాడీ సమస్యలతో కదల్లేని స్థితిలో ఉన్న వ్యక్తులు ఇతరులపై ఆధారపడకుండా సొంతంగా పనులు చేసుకునేలా చేయడమే దీని ప్రధాన లక్ష్యం. బాధితుల రోజువారీ జీవనంలో ఈ చిప్ తీసుకొచ్చే మార్పులను, అలాగే దీర్ఘకాలిక భద్రత, విశ్వసనీయతను పలు క్లినికల్ కేంద్రాల్లో క్షుణ్ణంగా అంచనా వేయనున్నారు.

న్యూరాలింక్ తయారు చేసిన ఈ పరికరం నాణెం పరిమాణంలో ఉంటుంది. దీనిని పుర్రె భాగంలో అమర్చి, సూక్ష్మమైన తీగల ద్వారా న్యూరాన్లతో అనుసంధానిస్తారు. మెదడు నుంచి వచ్చే కదలికల



సంకేతాలను గుర్తించి, కంప్యూటర్లకు చేరవేయడం ద్వారా శరీరాన్ని కదల్చకుండానే స్క్రీన్‌లను నియంత్రించేలా దీనిని రూపొందించారు. ఇప్పటికే అమెరికా, కెనడా, బ్రిటన్ దేశాల్లో 30 మందికి పైగా రోగులలో విజయవంతంగా ఈ చిప్‌లను అమర్చారు. వారు కంప్యూటర్లు వాడటం, వీడియో గేమ్‌లు ఆడటం, ఉన్నత చదువులు చదవడం వంటి పనులను సులువుగా చేస్తున్నారు. గతంలో జంతు ప్రయోగాల విషయంలో కొన్ని వివాదాలు వచ్చినప్పటికీ, మనుషులపై సాధిస్తున్న ఫలితాలు సరికొత్త ఆశలు రేకెత్తిస్తున్నాయి.ఈ సాంకేతికత భవిష్యత్తు గురించి ఎలాన్ మస్క్ గతంలో మాట్లాడారు. పక్షవాతం వచ్చిన వారికి కదలికలను పునరుద్ధరించడం, పుట్టుకతో అంధులైన వారికి చూపును అందించడం లాంటి లక్ష్యాలను ఆయన ప్రస్తావించారు. వీటిని సైన్స్ సాధించే అద్భుతాలని, అసాధారణ ఫలితాలని మస్క్ అభివర్ణించారు. తాజాగా ఎఫ్‌డీఏ అనుమతి లభించడంతో వైద్య రంగంలో బ్రెయిన్ చిప్ విప్లవం మరింత వేగవంతం కానుంది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

మళ్లీ ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా రోహిత్ శర్మ

మూడేళ్ల తర్వాత తిరిగి నాయకత్వ బాధ్యతలు.. హార్దిక్ పాండ్యా నిష్క్రమణతో రోహిత్‌కు పగ్గాలు.. ఐదు టైటిళ్లు అందించిన సారథిపై యాజమాన్యం నమ్మకం



ముంబై ఇండియన్స్ అభిమానులకు శుభవార్త. భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ మరోసారి ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ జట్టు పగ్గాలు చేపట్టనున్నాడు. మూడు సంవత్సరాల విరామం తర్వాత తిరిగి కెప్టెన్సీ బాధ్యతలు అందుకోవడం క్రికెట్ అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. 2027 ఐపీఎల్ సీజన్‌కు రోహిత్‌ను కెప్టెన్‌గా నియమిస్తూ ముంబై ఇండియన్స్ యాజమాన్యం శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన కెప్టెన్లలో ఒకరిగా గుర్తింపు పొందిన రోహిత్‌కు మరోసారి నాయకత్వ బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యత సంతరించుకుంది. **హార్దిక్ నిష్క్రమణతో మారిన సమీకరణాలు** 2024 ఐపీఎల్ సీజన్‌కు ముందు రోహిత్ శర్మను కెప్టెన్సీ నుంచి తప్పించి హార్దిక్ పాండ్యాకు బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. అయితే హార్దిక్ నాయకత్వంలో ముంబై ఇండియన్స్ ఆశించిన స్థాయిలో విజయాలు సాధించలేకపోయింది. మూడు సీజన్లలో కేవలం ఒక్కసారి మాత్రమే ప్లేఆఫ్స్‌కు చేరింది. 2026 సీజన్‌లోనూ జట్టు పేలవ ప్రదర్శనతో తొమ్మిదో స్థానానికి పరిమితమైంది. ఈ నేపథ్యంలో హార్దిక్ పాండ్యాను పంజాబ్ కింగ్స్‌కు ట్రేడ్ చేయగా, పంజాబ్ నుంచి ఆర్ష్‌దీప్ సింగ్ ముంబై జట్టులోకి వచ్చాడు. దీంతో ఖాళీ అయిన కెప్టెన్సీ బాధ్యతలను తిరిగి రోహిత్‌కు అప్పగించాలని యాజమాన్యం నిర్ణయించింది. **ఐదు టైటిళ్లతో అరుదైన రికార్డు** రోహిత్ శర్మ నాయకత్వంలో ముంబై ఇండియన్స్ ఐదుసార్లు ఐపీఎల్ విజేతగా నిలిచింది. 2013, 2015, 2017, 2019, 2020 సంవత్సరాల్లో జట్టుకు టైటిళ్లు అందించాడు. 2013లో మధ్యలో కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టి తొలి ప్రయత్నంలోనే ముంబైకి టైటిల్ అందించడం అతడి నాయకత్వ ప్రతిభకు నిదర్శనం. 11 సీజన్ల పాటు జట్టును నడిపించిన రోహిత్ తన వ్యూహాలు, ఆటగాళ్లతో సమన్వయం, ఒత్తిడిలో ప్రశాంతంగా నిర్ణయాలు తీసుకునే సామర్థ్యంతో ప్రత్యేక గుర్తింపు సంపాదించాడు. ఐదు టైటిళ్లతో ఎంఎస్ ధోనీతో కలిసి అత్యధిక ఐపీఎల్ టైటిళ్ల సాధించిన కెప్టెన్ల జాబితాలో కొనసాగుతున్నాడు. **అభిమానుల్లో కొత్త ఉత్సాహం** రోహిత్ తిరిగి కెప్టెన్ కావడంతో ముంబై ఇండియన్స్ అభిమానుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. గతంలో అతడి నాయకత్వంలో జట్టు సాధించిన విజయాలను అభిమానులు గుర్తుచేసుకుంటున్నారు. ముంబై జట్టు యాజమాన్యం కూడా రోహిత్ అనుభవం, నాయకత్వ లక్షణాలు, యువ ఆటగాళ్లను ప్రోత్సహించే విధానంపై విశ్వాసం వ్యక్తం చేసింది. జట్టు 20వ ఐపీఎల్ సీజన్‌లోకి అడుగుపెడుతున్న తరుణంలో రోహిత్‌కు మళ్లీ బాధ్యతలు అప్పగించడం ప్రత్యేకతను సంతరించుకుంది. **మళ్లీ పూర్వ వైభవం సాధిస్తుందా?** గత ఆరు సీజన్లుగా ఐపీఎల్ టైటిల్‌కు దూరంగా ఉన్న ముంబై ఇండియన్స్‌కు రోహిత్ పునరాగమనం కొత్త ఆశలు కలిగిస్తోంది. జట్టులో జస్ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ వంటి ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఉండటంతో సమతూకమైన జట్టును నిర్మించుకునే అవకాశం ఉంది. అయితే కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టడం ఒక ఎత్తయితే, జట్టును మరోసారి విజేతగా నిలపడం మరో ఎత్తు. ఆటగాళ్లందరినీ సమన్వయం చేసుకుంటూ సరైన వ్యూహాలతో ముందుకు సాగాల్సి ఉంటుంది. రోహిత్ అనుభవం ముంబైకి ఎంతవరకు ఉపయోగపడుతుంది? మరోసారి ఐపీఎల్ ట్రోఫీని అందించి అభిమానుల ఆశలను నెరవేరుస్తాడా? అన్నది 2027 సీజన్‌లో తేలనుంది.

టీ20 క్రికెట్‌లో చరిత్ర సృష్టించిన జయదేవ్ ఉనద్కట్!

● 11వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగి ప్రపంచ రికార్డు.. 26 బంతుల్లో 40 పరుగులు.. చేతన్ సకారియాతో కలిసి పదో వికెట్‌కు కీలక భాగస్వామ్యం



భారత క్రికెట్‌లో తన బౌలింగ్‌తో గుర్తింపు తెచ్చుకున్న సౌరాష్ట్ర కెప్టెన్ జయదేవ్ ఉనద్కట్ బ్యాటింగ్‌లోనూ అద్భుతం చేశాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో తమిళనాడుతో జరిగిన మ్యాచ్‌లో అరుదైన ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. సాధారణంగా 11వ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చే బౌలర్లు తక్కువ పరుగులకే పరిమితమవుతుంటారు. కానీ ఉనద్కట్ మాత్రం ప్రత్యర్థి బౌలర్లపై ఎదురుదాడికి దిగుతూ 26 బంతుల్లో 40 పరుగులు సాధించాడు. దీంతో పురుషుల టీ20 క్రికెట్ చరిత్రలో 11వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగి అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. **ఆరు సంవత్సరాల రికార్డు బద్దలు** ఇప్పటివరకు ఈ రికార్డు ఇంగ్లండ్ ఆటగాడు డానీ బ్రిగ్స్ పేరిట ఉండేది. 2020లో బిగ్‌బాష్ లీగ్‌లో అడిలైడ్ స్ట్రైకర్స్ తరఫున ఆడిన బ్రిగ్స్ హోబర్ట్ హరికేన్స్‌పై 18 బంతుల్లో అజేయంగా 35 పరుగులు చేశాడు. తాజాగా ఉనద్కట్ 40 పరుగులతో ఆ రికార్డును అధిగమించాడు. తన ఇన్నింగ్స్‌లో మూడు ఫోర్లు, రెండు సిక్సర్లు బాదాడు. కష్టాల్లో ఉన్న జట్టును ఆదుకోవడమే కాకుండా టీ20 చరిత్రలో తన పేరును చిరస్థాయిగా నిలుపుకున్నాడు. **చేతన్ సకారియాతో అద్భుత భాగస్వామ్యం** ఈ మ్యాచ్‌లో సౌరాష్ట్ర జట్టు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంది. 193 పరుగుల లక్ష్య ఛేదనలో ఒక దశలో 92 పరుగులకే తొమ్మిది వికెట్లు కోల్పోయింది. ఈ సమయంలో క్రీజులోకి వచ్చిన ఉనద్కట్, చేతన్ సకారియాతో కలిసి అద్భుతంగా పోరాడారు. చివరి వికెట్‌కు 49 బంతుల్లో 62 పరుగులు జోడించారు. టీ20 క్రికెట్‌లో పదో వికెట్‌కు నమోదైన అత్యధిక భాగస్వామ్యాల్లో ఇది సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచింది. అయితే వీరిద్దరి పోరాటం జట్టుకు విజయాన్ని అందించలేకపోయింది. **38 పరుగులతో తమిళనాడు విజయం** తొలుత బ్యాటింగ్ చేసిన తమిళనాడు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన సౌరాష్ట్ర 16.4 ఓవర్లలో 154 పరుగులకే ఆలౌటైంది. దీంతో తమిళనాడు 38 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఉనద్కట్ వ్యక్తిగత రికార్డు సాధించినప్పటికీ సౌరాష్ట్రకు ఓటమి తప్పలేదు. ఈ పరాజయంతో సౌరాష్ట్ర సూపర్ లీగ్ దశకు అర్హత సాధించే అవకాశాన్ని కోల్పోయింది. **రికార్డుల పుస్తకంలో ఉనద్కట్ పేరు** 35 ఏళ్ల జయదేవ్ ఉనద్కట్ భారత జట్టు తరఫున టెస్టులు, వన్డేలు, టీ20లు ఆడాడు. ఐపీఎల్‌లోనూ పలు జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. ప్రధానంగా ఎడమచేతి మీడియం పేసర్‌గా గుర్తింపు పొందిన అతడు కీలక సమయంలో బ్యాట్‌తోనూ సత్తా చాటడం విశేషం. ఈ ప్రదర్శనతో దేశవాళీ క్రికెట్‌లో తన సత్తా మరోసారి నిరూపించుకున్నాడు. ఓటమి ఎదురైనా వ్యక్తిగతంగా సాధించిన ప్రపంచ రికార్డు మాత్రం ఉనద్కట్ కెరీర్‌లో ప్రత్యేక ఘనతగా నిలిచిపోనుంది.

ప్రపంచకప్‌లో వైభవ్‌కు చోటివ్వాలి!

● 2027 వన్డే ప్రపంచకప్‌కు ఎంపిక చేయాలంటూ శ్రీకాంత్ డిమాండ్.. 15 ఏళ్ల యువ సంచలనంపై ప్రశంసల వర్షం.. సెలెక్టర్లు ఇప్పటికైనా గుర్తించాలంటూ సూచన



భారత క్రికెట్‌లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ పేరు మరోసారి మార్మోగుతోంది. తన విధ్వంసకర బ్యాటింగ్‌తో ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షిస్తున్న ఈ 15 ఏళ్ల కుర్రాడిని వచ్చే ఏడాది జరగనున్న వన్డే ప్రపంచకప్ జట్టులోకి తీసుకోవాలని భారత మాజీ క్రికెటర్, మాజీ చీఫ్ సెలెక్టర్ కృష్ణమాచారి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. వైభవ్‌లో మూడు ఫార్మాట్లలోనూ రాణించే సామర్థ్యం ఉందని, అతడి ప్రతిభను గుర్తించి జాతీయ జట్టులో మరిన్ని అవకాశాలు కల్పించాలని సూచించారు. కేవలం భవిష్యత్తు ఆటగాడిగా చూడకుండా ఇప్పటి నుంచే పెద్ద వేదికలపై ఆడించేలా చర్యలు తీసుకోవాలని సెలెక్టర్లకు విజ్ఞప్తి చేశారు. **53 బంతుల్లో 204 పరుగులు.. సంచలన ఇన్నింగ్స్** ఇటీవల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ అసాధారణ బ్యాటింగ్‌తో చెలరేగాడు. కేవలం 53 బంతుల్లోనే 204 పరుగులు సాధించి క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాడు. ఈ ఇన్నింగ్స్‌లో 28 సిక్సర్లు, ఏడు ఫోర్లు బాదాడు. కేవలం 28 బంతుల్లోనే శతకం పూర్తి చేయగా, 52 బంతుల్లో ద్విశతకాన్ని అందుకున్నాడు. లిస్ట్-ఏ క్రికెట్‌లో అత్యంత వేగంగా శతకం, ద్విశతకం సాధించిన ఆటగాడిగా పలు రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. అతడి విధ్వంసకర ఇన్నింగ్స్‌తో ఇండియా-ఏ జట్టు ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. **మూడు ఫార్మాట్లలోనూ ఆడించాలి** వైభవ్ బ్యాటింగ్‌పై ముగ్ధుడైన శ్రీకాంత్ తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడుతూ అతడిని అన్ని ఫార్మాట్లకు సరిపోయే ఆటగాడిగా అభివర్ణించారు. టెస్టు క్రికెట్‌లో వెంటనే ఆడించడానికి జట్టు యాజమాన్యం సిద్ధంగా లేకపోయినా కనీసం 15 మంది సభ్యుల జట్టులో చోటు కల్పించాలని సూచించారు. త్వరలో శ్రీలంకతో జరగనున్న వన్డే సిరీస్‌లోనూ అవకాశం ఇవ్వాలని కోరారు. యువ ఆటగాడిని తీర్చిదిద్దాలంటే పెద్ద టోర్నీల్లో ఆడించే ధైర్యం చేయాలని, 2027 ప్రపంచకప్ జట్టులో అతడికి స్థానం కల్పించాలని స్పష్టం చేశారు. భవిష్యత్తులో వైభవ్ ఒంటిచేత్తో భారత్‌కు విజయాలు అందించే స్థాయికి ఎదుగుతాడని విశ్వాసం వ్యక్తం చేశారు. **సచిన్, కోహ్లీలతో పోలిక** వైభవ్ బ్యాటింగ్‌లో కేవలం బంతిని బలంగా బాదే శక్తి మాత్రమే లేదని, అద్భుతమైన టైమింగ్, ఆత్మవిశ్వాసం కూడా ఉన్నాయని శ్రీకాంత్ ప్రశంసించారు. మైదానంలో ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఆడే విధానం అతడిలోని ప్రత్యేక ప్రతిభను తెలియజేస్తోందన్నారు. క్రికెట్ దేవుడిగా పేరొందిన సచిన్ టెండూల్కర్, కింగ్ విరాట్ కోహ్లీల తర్వాత వైభవ్ మరో గొప్ప ఆటగాడిగా ఎదిగే అవకాశం ఉందంటూ ప్రశంసించారు. అతడి ప్రతిభను గుర్తించకుండా ఇంకా అనుభవం కావాలంటూ అవకాశాలను పరిమితం చేయడం సరైన పద్ధతి కాదని అభిప్రాయపడ్డారు. **ప్రతిభకు తగిన అవకాశాలు దక్కేనా?** వైభవ్ ఇప్పటికే తన అసాధారణ ఆటతీరుతో దేశవాళీ క్రికెట్‌లో ప్రత్యేక గుర్తింపు సంపాదించాడు. ఐపీఎల్‌లోనూ తన సత్తా చాటుతూ భవిష్యత్తుపై భారీ అంచనాలు పెంచాడు. అయితే అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణించాలంటే తగిన అవకాశాలతో పాటు అనుభవం కూడా అవసరం. అతడిపై అధిక అంచనాలు, ఒత్తిడి పెంచకుండా సరైన మార్గదర్శకత్వం ఇవ్వడం జట్టు యాజమాన్యం బాధ్యత. మరోవైపు ప్రతిభావంతులైన యువ ఆటగాళ్లను గుర్తించి ప్రోత్సహించడం సెలెక్టర్ల కర్తవ్యం. శ్రీకాంత్ చేసిన సూచనలను బీసీసీఐ, జట్టు యాజమాన్యం ఎంతవరకు పరిగణనలోకి తీసుకుంటాయో చూడాలి. 2027 ప్రపంచకప్‌లో వైభవ్‌కు చోటు దక్కుతుందా? భారత జెర్సీతో అంతర్జాతీయ వేదికపై మరోసారి తన బ్యాట్‌తో సంచలనాలు సృష్టిస్తాడా? అన్నది ఆసక్తికరంగా మారింది.

బౌలింగ్ యాక్షన్ మార్చిన బుమ్రా..

న్యూజిలాండ్‌తో రెండో టెస్టులో కొత్త ప్రయోగం.. ఒక చేతిలో బంతితో రన్‌అప్.. ముందుగానే సాధన చేశాడన్న ఆకాష్ దీప్!



భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా తన బౌలింగ్‌లో చేసిన చిన్న మార్పు ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో చర్చనీయాంశంగా మారింది. న్యూజిలాండ్‌తో క్రైస్ట్‌చర్చ్ వేదికగా జరుగుతున్న రెండో టెస్టు తొలి రోజు బుమ్రా విభిన్నమైన రన్‌అప్‌తో బౌలింగ్‌కు రావడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. సాధారణంగా రెండు చేతులతో బంతిని పట్టుకొని, తనదైన ప్రత్యేక శైలిలో పరుగెత్తుకుంటూ వచ్చి బౌలింగ్ చేసే బుమ్రా.. ఈసారి ఒక చేతిలో బంతిని పట్టుకొని మరో చేతిని వేరుగా ఉంచి క్రీజు వైపు పరుగెత్తాడు. దీంతో అతడి బౌలింగ్ శైలిలో మార్పు ఎందుకు వచ్చిందన్న చర్చ మొదలైంది. **ఒక చేతిలో బంతితో కొత్త ప్రయోగం** బుమ్రా బౌలింగ్ యాక్షన్ ప్రపంచ క్రికెట్‌లోనే ప్రత్యేకమైనది. అతడి రన్‌అప్, బంతిని విడుదల చేసే విధానం బ్యాటర్లకు సవాలుగా నిలుస్తుంటాయి. అయితే రెండో టెస్టులో అతడు అనుసరించిన కొత్త విధానం అందరి దృష్టిని ఆకర్షించింది. ముఖ్యంగా పరుగెత్తే సమయంలో రెండు చేతులను కలిపి ఉంచకుండా ఒక చేతిలోనే బంతిని పట్టుకొని బౌలింగ్‌కు సిద్ధమయ్యాడు. అతడి అడుగుల కదలికల్లోనూ స్వల్ప మార్పు కనిపించింది. బంతిని విడుదల చేసే సమయంలో మాత్రం సాధారణ బౌలింగ్ యాక్షన్‌లో పెద్దగా మార్పు కనిపించలేదు. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో అభిమానులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. **ముందుగానే సాధన చేశాడన్న ఆకాష్ దీప్** బుమ్రా కొత్త బౌలింగ్ విధానంపై భారత జట్టు సహచరుడు ఆకాష్ దీప్ ఆసక్తికర విషయాన్ని వెల్లడించాడు. మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో ఈ మార్పుపై ప్రశ్నించగా.. బుమ్రా ప్రాక్టీస్ మ్యాచ్‌కు ముందే ఇలాంటి బౌలింగ్‌ను సాధన చేశాడని తెలిపాడు. అతడి మనసులో ఏదో ప్రత్యేకమైన ప్రణాళిక ఉండి ఉంటుందని, అందుకే ఈ విధంగా ప్రయత్నిస్తున్నాడని పేర్కొన్నాడు. బుమ్రా ఏం చేసినా ఒక ఆలోచనతోనే చేస్తాడని అతడిపై నమ్మకం వ్యక్తం చేశాడు. దీంతో ఈ మార్పు అకస్మాత్తుగా తీసుకున్న నిర్ణయం కాదని స్పష్టమవుతోంది. అయితే దాని వెనుక ఉన్న అసలు వ్యూహాన్ని బుమ్రా వెల్లడించలేదు.

సహచర ఆటగాడిపైనే హర్షిత్ రాణా ఆగ్రహం!

షాబాజ్ అహ్మద్‌పై అసభ్య పదజాలం.. వైరల్‌గా మారిన వీడియో.. యువ పేసర్ తీరుపై అభిమానుల విమర్శలు



భారత యువ పేసర్ హర్షిత్ రాణా మరోసారి వివాదంలో చిక్కుకున్నాడు. ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ సెమీఫైనల్‌లో శ్రీలంక-ఏతో జరిగిన మ్యాచ్ సందర్భంగా సహచర ఆటగాడు షాబాజ్ అహ్మద్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన ఘటన చర్చనీయాంశంగా మారింది. షాబాజ్‌ను ఉద్దేశించి హర్షిత్ అసభ్య పదజాలం ఉపయోగించినట్లు కనిపిస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో అభిమానులు విమర్శలు గుప్పిస్తున్నారు. **బంతి ఆపినా తగ్గని ఆగ్రహం** మ్యాచ్‌లో హర్షిత్ రాణా బౌలింగ్ చేస్తున్న సమయంలో శ్రీలంక బ్యాటర్ కొట్టిన బంతిని ఫీల్డింగ్ చేస్తున్న షాబాజ్ అహ్మద్ బౌండరీ వద్ద అడ్డుకున్నాడు. అయితే బంతిని తిరిగి విసరడంలో కొంత ఆలస్యం కావడంతో బ్యాటర్లు రెండు పరుగులు తీశారు. దీంతో అసహనానికి గురైన హర్షిత్.. షాబాజ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ క్రమంలో అసభ్య పదజాలం ఉపయోగించినట్లు వీడియోలో వినిపించడంతో వివాదం మొదలైంది. **షాబాజ్ ప్రదర్శనపై ప్రశంసలు** అదే మ్యాచ్‌లో షాబాజ్ అహ్మద్ బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణించాడు. 48 బంతుల్లో అజేయంగా 54 పరుగులు సాధించాడు. ఇందులో నాలుగు సిక్సర్లు ఉన్నాయి. బౌలింగ్‌లోనూ ఒక వికెట్ పడగొట్టాడు. జట్టు కోసం రెండు విభాగాల్లోనూ కష్టపడిన ఆటగాడిపై హర్షిత్ ఇలా వ్యవహరించడం సరికాదని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. **భారత్-ఏకు ఘోర పరాజయం** తొలుత బ్యాటింగ్ చేసిన భారత్-ఏ జట్టు 50 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 317 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో శ్రీలంక-ఏ జట్టు అద్భుతంగా ఆడింది. లసిత్ క్రూస్‌పుల్లె 116, సినెత్ జయవర్ధనే 105 పరుగులతో శతకాలు సాధించారు. దీంతో శ్రీలంక-ఏ జట్టు కేవలం 41.3 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. ఎనిమిది వికెట్ల తేడాతో విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. హర్షిత్ రాణా ఏడు ఓవర్లలో 61 పరుగులు ఇచ్చి ఒక వికెట్ మాత్రమే తీశాడు. **దూకుడుతో పాటు క్రమశిక్షణ అవసరం** క్రికెట్‌లో దూకుడు ఆటగాళ్లకు అవసరమే. ముఖ్యంగా ఫాస్ట్ బౌలర్లు ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచేందుకు దూకుడుగా వ్యవహరిస్తుంటారు.

స్టార్‌డమ్ పక్కనపెట్టిన జగపతిబాబు.. వర్కర్లతో కలిసి భోజనం



సినిమాల్లో క్రూరమైన విలన్‌గా భయపెట్టే నటుడు జగపతిబాబు నిజ జీవితంలో మాత్రం ఎంతో ఆత్మీయంగా మెలుగుతాడు. వెండితెరపై ఎంతటి గంభీరమైన పాత్రలు పోషించినా బయట చాలా సరదాగా ఉంటాడు. చిత్ర పరిశ్రమలో అగ్ర నటుడిగా ఎంతో గుర్తింపు ఉన్నప్పటికీ ఎలాంటి స్టార్ డమ్ ప్రదర్శించడు. ప్రతి ఒక్కరితో సమానంగా కలిసిపోతూ తన ప్రత్యేకతను చాటుకుంటారు.
తాజాగా ఆయన పంచుకున్న ఒక దృశ్యం సోషల్ మీడియాలో అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. తన వద్ద పనిచేసే వర్కర్లతో కలిసి ఆయన స్వయంగా భోజనం చేశాడు. పనివారి కోసం బయటి నుంచి ప్రత్యేకంగా రుచికరమైన ఆహారాన్ని తెప్పించాడు. అదే సమయంలో వారు తమ ఇళ్ల నుంచి తెచ్చుకున్న సాధారణ భోజనాన్ని తానే స్వయంగా ఎంతో ఇష్టంగా తిన్నాడు.
పనివారితో కలిసి సరదాగా మాట్లాడుతూ గడిపిన ఈ క్షణాలను ఆయన 'ఎక్స్' వేదికగా అభిమానులతో పంచుకున్నాడు. హోదా, అంతస్తుల తేడాలు చూపించకుండా మనుషులకు విలువనిచ్చే ఆయన తీరును చూసి నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. సామాన్యులతో ఇంత సులువుగా కలిసిపోయే వ్యక్తిత్వం నిజంగా అరుదని ప్రశంసిస్తున్నారు. నటుడిగా ఎంత ఎదిగినా ఒదిగి ఉండే ఆయన నిరాడంబరతకు ఫిదా అవుతున్నారు. ప్రస్తుతం ఈ వీడియో ఇంటర్నెట్‌లో తెగ చక్కర్లు కొడుతూ విస్తృతంగా ట్రెండ్ అవుతోంది.

'అలియాస్ రుక్మిణీ' ట్రైలర్ రిలీజ్

అమాయకపు కోర్టు స్టెనోగా నితిన్..

టాలీవుడ్ యువ కథానాయకుడు నితిన్ నటించిన సరికొత్త వింటేజ్ రొమాంటిక్ కామెడీ డ్రామా 'అలియాస్ రుక్మిణీ' థియేట్రికల్ ట్రైలర్ గురువారం విడుదలైంది. నేచురల్ స్టార్ నాని సమర్పణలో, 'యునానిమస్ ప్రొడక్షన్స్' పతాకంపై దీప్తి గంటా నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం వహించారు. 2000 దశకం నాటి వింటేజ్ నేపథ్యంలో నడిచే ఈ కథలో నితిన్ లుక్, పాత్ర స్వభావం సరికొత్తగా ఆకట్టుకుంటున్నాయి.
ట్రైలర్ ప్రకారం.. నితిన్ ఇందులో 'కృష్ణ' అనే ఫ్యామిలీ కోర్టు స్టెనోగ్రాఫర్ పాత్రలో నటిస్తున్నారు. కళ్లద్దాలు పెట్టుకుని, పైకి ఎంతో అమాయకంగా, పద్ధతిగా కనిపించే ఈ యువకుడి వెనుక ఒక పెద్ద రహస్యం దాగి ఉంటుంది. ఇంట్లో వాళ్లు "కోరికలే గుర్రాలైతేనా.. ఇవి చదువుతున్నాడా?" అని కంగారు పడుతుంటే.. "చదవట్లేదు.. రాస్తున్నాడు!" అంటూ రివీల్ అయ్యే సీక్రెట్ నవ్వులు పూయిస్తోంది. తన అసలు గుర్తింపు దాచి, ఒక అమ్మాయి కలం పేరుతో ఆ పుస్తకాలు రాస్తున్నట్లు కథనం ద్వారా స్పష్టమవుతోంది. ట్రైలర్ ముగింపులో కథానాయిక ఆఫియా సయ్యద్.. "ఇప్పుడు మిమ్మల్ని ఏమని పిలవాలి? కృష్ణ అనా లేకపోతే రుక్మిణీ అనా?" అని అడిగే డైలాగ్ టైటిల్ వెనుక ఉన్న ట్విస్ట్‌పై మరింత ఆసక్తిని పెంచుతోంది.
ట్రైలర్‌లో చూపించిన పెళ్లిచూపుల సన్నివేశాలు చాలా సహజంగా, నేటి యువతను ఆకట్టుకునేలా ఉన్నాయి. వరుసగా ముగ్గురు తిరస్కరించిన తర్వాత నాలుగో పెళ్లిచూపులకు వెళ్లిన హీరో.. "నన్ను కలవడానికి మీరు ఎంతమందిని రిజెక్ట్ చేశారో తెలుసుకుందామని అడిగాను" అని చెప్పే సంభాషణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం డిసెంబరు 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. జోమోన్ టి.జాన్ కెమెరా పనితనం, విజయ్ బుల్గానిన్ అందించిన నేపథ్య సంగీతం సినిమా వింటేజ్ ఫీల్‌ను మరింత పెంచాయి. తన కెరీర్‌లోనే ఇది ఉత్తమ చిత్రంగా నిలుస్తుందని నితిన్ ఇప్పటికే ధీమా వ్యక్తం చేశాడు.



తొలి చూపులోనే ఫిదా -ఆఫీయా సయ్యద్



టాలీవుడ్ లో నేచురల్ స్టార్ నాని కొత్త కథలను ఎంకరేజ్ చేయడంలో ఎప్పుడూ ముందుంటారు. ఆయన సమర్పణలో నితిన్ హీరోగా వస్తున్న 'అలియాస్ రుక్మిణీ' ట్రైలర్ ఇప్పుడందరినీ ఆకట్టుకుంటోంది. అయితే ఈ ట్రైలర్‌లో నితిన్ సరసన కనిపించిన అమ్మాయి ఎవరనే చర్చ మొదలైంది. తొలిచూపులోనే తన సహజమైన నటనతో ఫిదా చేస్తున్న ఆ బ్యూటీ మరెవరో కాదు, ఆఫీయా సయ్యద్. ఆమె బ్యాక్ గ్రౌండ్ తెలిస్తే ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందే. ఆ విశేషాలు చూద్దాం..
ఆఫీయా సయ్యద్ సాధారణ కుటుంబం నుంచి వచ్చిన అమ్మాయి కాదు. బాలీవుడ్‌లో ఎన్నో బ్లాక్‌బస్టర్ చిత్రాలను నిర్మించిన ప్రముఖ నిర్మాత సాజిద్ నడియాద్వాలా మేనకోడలు ఆమె. అంత పెద్ద సినీ నేపథ్యం ఉన్నా, తనకంటూ సొంత గుర్తింపు తెచ్చుకోవాలనే ఆలోచనతో అడుగులు వేస్తోంది. ఇక అక్టోబర్ 2న విడుదలైన 'ప్రేమ్ కీతను' అనే హిందీ సినిమాతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి, ఇప్పుడు డిసెంబర్ 4న 'అలియాస్ రుక్మిణీ'తో తెలుగు ప్రేక్షకులను పలకరించబోతోంది. మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో నితిన్ 'కృష్ణ' అనే ఫ్యామిలీ కోర్టు స్టెనోగా కనిపిస్తాడు. పైకి ఎంతో అమాయకంగా కనిపించే అతను, రహస్యంగా ఒక అమ్మాయి పేరుతో రొమాంటిక్ పుస్తకాలు రాస్తుంటాడు. ఆ కథలో 'రుక్మిణీ' అనే పేరుకు, ఆఫీయా పాత్రకు ఉన్న లింక్ ట్రైలర్‌లో భలే ఫ్రెష్‌గా అనిపించింది. ఇక పెళ్లిచూపుల సీన్లలో నితిన్, ఆఫీయా మధ్య వచ్చే సంభాషణలు యూత్‌కు ఇట్టే కనెక్ట్ అయ్యేలా ఉన్నాయి

రాజకీయాలపై మక్కల్ సెల్వన్ మనసులో మాట!

మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి స్టార్ డమ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. కోట్లాది మంది అభిమానులున్న బిగ్ స్టార్. హీరో అయినా? విలన్ అయినా? ఇంకెలాంటి పాత్ర అయినా? అందులో అభినయించాలంటే సేతుపతి ఉండాల్సిందే అంటారు. అతడి ట్యాలెంట్ చూసి ఫ్యూచర్ సూపర్ స్టార్ రజనీకాంత్ లా ఎదుగుతాడని కెరీర్ ఆరంభంలోనే మాట్లాడుకున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా రాజకీయాలపై సేతుపతి మనసులో మాటను బయటపెట్టారు. చాలామంది నటులు సినిమాల్లో రాణించిన తర్వాత పాలిటిక్స్ వైపు అడుగులు వేస్తుంటారు. కానీ విజయ్ సేతుపతి ఆలోచన మాత్రం అందుకు భిన్నంగా ఉండటం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. తనకు ప్రస్తుతానికి రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన లేదని సినిమాలే మొదటి ప్రాధాన్యత అని తేల్చి చెప్పారు. ఇతరుల కోసం కాకుండా మనస్ఫూర్తిగా ఏదైనా చేయాలనే తపన ఉంటేనే రాజకీయాల్లోకి రావాలని అభిప్రాయపడ్డారు. పేరు కోసమో? అధికారం కోసమో? పాలిటిక్స్‌లోకి వెళ్లే మనస్తత్వం తనది కాదని స్పష్టం చేశారు. సమాజంలోని సమస్యలపై స్పందించడం వేరు. రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉండటం వేరు అని సేతుపతి అన్నారు. సాధారణ పౌరుడిగా తనకు నచ్చిన విషయాలపై మాట్లాడే హక్కు ఎప్పుడూ ఉంటుందన్నారు. సినిమా రంగంలో ఇంకా చేయడానికి చాలా ఉందని కొత్త కథలు, కొత్త పాత్రలతో ప్రేక్షకులను అలరించడమే లక్ష్యమని చెప్పుకొచ్చారు. తమిళనాడులో సినీ తారల రాజకీయ ఎంట్రీ ఎప్పుడూ హాట్ టాపిక్‌గానే ఉంటుంది. ఈ క్రమంలో విజయ్ సేతుపతి కూడా భవిష్యత్తులో పార్టీ పెడతారా లేక ఏదైనా పార్టీకి మద్దతు ఇస్తారా అనే ఊహాగానాలు గతంలో చాలాసార్లు వచ్చాయి. వాటన్నింటికీ సేతుపతి మాటలతో చెక్ పెట్టారు. తాను ఎవరికీ పోటీ కాదని.. తన దారి తనదేనని చెప్పకనే చెప్పారు.



షార్ట్‌ఫిలింతో సత్తా చాటి..

ఆస్కార్ బరిలో తెలుగమ్మాయిలు



ఆస్కార్ పురస్కారాలకు ఇప్పటకే భారత్ నుంచి 'గోంధల్', 'అంగ్' ఉత్తమ చిత్రాల అంతర్జాతీయ చిత్రం విభాగంలో పరిశీలనకు ఎంపికైన సంగతి తెలిసిందే. అయిత మరో ఘు చిత్రం కూడా ఆస్కార్ అకాడమీ పరిశీలనకు అర్హత సాధించింది కన్నడ-తెలుగు షార్ట్ ఫిలిమ్ 'పంకజ'.. దర్శకురాలు అనూయ స్వామితో పాటు ప్రధాన పాత్రలో నటించిన హర్షిణి బోయళ్ల కూడా తెలుగు వారే కావడం విశేషం. ఈ ఇద్దరు బెంగళూరులో పుట్టి పెరిగారు. భాషలునేర్చుకోండి బెంగళూరులోని ఓ మురికి వాడలో నివసించే కుటుంబాల నేపథ్యంలో 'పంకజ'ను తెరకెక్కించారు. పంకజ అనే మహిళ.. కనిపించకుండా పోయిన తన భర్తను కుమార్తెతో కలిసి వెతికే క్రమంలో ఎదురైన అనుభవాలనే ఈ చిత్ర కథాంశం. ఈ షార్ట్ ఫిలిమ్. ప్రతిష్ఠాత్మక సన్‌డ్యాన్స్ ఫిలిం ఫెస్టివల్ సహా 40కిపైగా అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో ప్రదర్శితమైంది. రెయిన్‌డ్యాన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో విజేతగా నిలవడం ద్వారా ఆస్కార్ పరిశీలనకు అర్హత సాధించింది.



'ఏఐ ట్రూత్ బాంబ్' పేరుతో సంచలన పోస్ట్ చేసిన ఆర్‌జీవీ

సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ 'ఏఐ ట్రూత్ బాంబ్' పేరుతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏఐని ఉపయోగించే వ్యక్తులు, దానిని ఉపయోగించని వారిని భర్తీ చేస్తారని (రీప్లేస్ చేస్తారని) ఆయన స్పష్టం చేశారు. ఏఐ కారణంగా ఉద్యోగాలు పోతున్నాయన్న ఆందోళనపై తనదైన శైలిలో సుదీర్ఘ విశ్లేషణను సోషల్ మీడియాలో పంచుకున్నారు.
ఉద్యోగ రంగంలో ఏఐ ప్రభావంపై తన ఆలోచనలను పంచుకుంటూ.. "చాలా మంది ఉద్యోగులు ఏఐ తమ ఉద్యోగాలను దొంగిలిస్తోందని గట్టిగా అరుస్తున్నారు, కానీ నిజానికి వారే తమను తాము 'దొంగిలించుకుంటున్నారు'" అని వర్మ వ్యాఖ్యానించారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కోడ్ రాయడానికి, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఐడియాల కోసం, అనలిస్ట్ డేటా విశ్లేషణకు చాట్‌జీపీటీ, క్లాడ్, మిడ్‌జర్నీ వంటి ఏఐ టూల్స్‌ను రహస్యంగా వాడుతున్నారని ఆయన వివరించారు. తాము కష్టపడి చేసినట్టుగా ఆ పనిని పైఅధికారుల ముందు ప్రెజెంట్ చేస్తున్నారని పేర్కొన్నారు. "ప్రతి ఒక్కరూ దీన్ని రహస్యంగా చేస్తున్నారు, కానీ ఎవరూ ఒప్పుకోవడం లేదు. అయితే, కంపెనీలకు ఈ విషయం గణాంకాల రూపంలో తెలిసిపోతుంది" అని వర్మ అన్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613